శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త





## సిఎం చంద్రబాబునాయుడుకు స్వాగతం పలికిన ఎంపి బీద మస్తాన్‌రావు



**కావలి, జులై 22 ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారిక పర్యటన నిమిత్తం బుధవారం ఢిల్లీకి చేరుకొన్నారు. ఢిల్లీ విమానామాశ్రా యానికి చేరుకున్న ముఖ్యమంత్రిని రాజ్యసభ సభ్యులు డాక్టర్ బీద మస్తాన్‌రావు యాదవ్ మర్యాదపూర్వకంగా విమానాశ్రయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై సిఎంతో బీద మస్తాన్‌రావు యాదవ్ చర్చించారు. కేంద్ర ప్రభుత్వంతో జరగనున్న సమావేశాలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ అధికారిక పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి పార్లమెంట్ హౌస్‌కు చేరుకుని పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం,జులై 22, ప్రభాత వార్త:** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి బుధవారం సాయంత్రానికి 0 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 30.927 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి150, ఎన్ఎఫ్‌సికి 50, పెన్నా డెల్టా 0 క్యూసెక్కు ల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం91.845మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

## నీతి ఆయోగ్ పరిశోధన పథకంపై పార్లమెంటులో ఎంపీ వేమిరెడ్డి

- పరిశోధన నిధుల వినియోగం, నాణ్యత పర్యవేక్షణపై కేంద్రం వివరణ
- ఐదేళ్లలో 87 ప్రాజెక్టులకు ఆమోదం, 67 పూర్తయినట్లు వెల్లడి

**నెల్లూరు, జూలై 22, ప్రభాతవార్త - వైద్యం** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నీతి ఆయోగ్ రీసెర్చ్ స్కీమ్ 2021 కింద కేటాయించిన నిధులు, వాటి వినియోగం, పరిశోధనల నాణ్యతా ప్రమాణాల పర్యవేక్షణపై నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పార్లమెంటులో లిఖిత పూర్వకంగా పలు ప్రశ్నలు అడిగారు. ఎంపీ అడిగిన ప్రశ్నలకు కేంద్ర ప్రణాళికా శాఖ సహాయ మంత్రి రావు ఇంద్రజిత్ సింగ్ బుధవారం లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఎంపీ అడిగిన ప్రశ్నలకు స్పందిస్తూ నీతి ఆయోగ్ పరిశోధన పథకం కింద 2021-22 ఆర్థిక సంవత్సరం నుంచి 2025-26 వరకు కేటాయించిన నిధులను ప్రభుత్వం సమర్థంగా వినియోగిస్తోందని కేంద్ర మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా 2021-22లో రూ.6 కోట్లు కేటాయించగా రూ.3.42 కోట్లు, 2022-23లో రూ.6 కోట్లకు గాను రూ.3.38 కోట్లు, 2023-24లో రూ.4 కోట్లకు గాను రూ.2.55 కోట్లు, 202425లో రూ.4 కోట్లకు గాను రూ.3.99 కోట్లు, 2025-26లో కేటాయించిన రూ.6 కోట్లలో రూ.5.98 కోట్లు వెచ్చించినట్లు వెల్లడించారు. గడచిన ఐదేళ్లలో ఆర్ఎస్ఎన్ఏ పథకం కింద మొత్తం 87 పరిశోధన ప్రాజెక్టులను ఆమోదించి ప్రారంభించామని, వాటిలో 67 ప్రాజెక్టులు విజయవంతంగా పూర్తయ్యాయని కేంద్ర మంత్రి వివరించారు. ప్రస్తుతం 2026 జులై 15 నాటికి 42 ప్రాజెక్టులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని, ప్రాజెక్టుల స్వభావం, విస్తృతిని బట్టి వాటి పూర్తి కాల పరిమితి సగటున 13 నుంచి 23 నెలల వరకు పడుతుందని పేర్కొన్నారు. 2021-22లో 16 ప్రాజెక్టులు ఆమోదం పొందగా 13 పూర్తయ్యాయని (సగటున 23 నెలలు), 2022-23లో 12 ప్రాజెక్టులు ఆమోదం పొంది 12 పూర్తయ్యాయని (సగటున 17 నెలలు), 2023-24లో 14 ప్రాజెక్టులు ఆమోదం పొంది 14 పూర్తయ్యాయని (సగటున 18 నెలలు), 2024-25లో 14 ప్రాజెక్టులు ఆమోదం పొంది 16 పూర్తయ్యాయని (సగటున 19 నెలలు), 2025-26లో 31 ప్రాజెక్టులు ఆమోదం పొందగా 12 పూర్తయ్యాయని (సగటున 13 నెలలు) కేంద్ర మంత్రి వివరించారు. ఈ పథకంలో రాష్ట్రాల వారీగా నిధుల కేటాయింపు ఉండదని, అర్హత, ప్రాధాన్యతల ఆధారంగా దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ సంస్థలు, విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, స్వతంత్ర



పరిశోధకులకు పరిశోధనల బాధ్యతలను అప్పగిస్తామని స్పష్టం చేశారు. తెలంగాణలోని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్, నిరాడ్ వంటి సంస్థలతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న ఐఐటీలు, ఐఐఎంలు, ఐఎస్ఐలతో సహా మొత్తం 72 సంస్థలు, వ్యక్తిగత పరిశోధకులకు ఈ పథకం కింద ఆర్థిక సహాయం అందించినట్లు కేంద్ర మంత్రి తెలిపారు. పరిశోధనల నాణ్యత, సమయానుకూలతను పర్యవేక్షించేందుకు ప్రత్యేక యంత్రాంగం ఉందని కేంద్ర మంత్రి తెలిపారు. పరిశోధనా నివేదికల నాణ్యతను పరిశీలించిన తర్వాతే చెల్లింపులు ఉంటాయని వివరించారు. ఒకవేళ పరిశోధన నివేదికలు అందజేయడంలో ఆలస్యమైనా లేక నాణ్యతా ప్రమాణాలకు లోబడి లేకపోయినా జరిమానాలు విధించడం లేదా ఒప్పందాన్ని రద్దు చేయడం వంటి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే ఈ పథకానికి సంబంధించిన మార్గదర్శకాలను నీతి ఆయోగ్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు కేంద్ర మంత్రి తెలిపారు.

## పంటల బీమా పథకాల అమలులో ప్రతి అర్హ రైతు నమోదు అయ్యేలా చర్యలు తీసుకోండి

- జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా



**నెల్లూరు, జూలై 22, ప్రభాతవార్త - కలెక్టరేట్** ఖరీఫ్ -2026 సీజన్‌లో పంటల బీమా పథకాల అమలును సమర్థవంతంగా నిర్వహించి, అర్హులైన ప్రతి రైతు నిర్ణీత గడువులోపు పంటల బీమాలో నమోదు అయ్యేలా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో పంటల బీమా పథకాల అమలుపై జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా నిర్వహించారు. ఈ సందర్భంగా ఖరీఫ్-2026 సీజన్‌లో జిల్లాలో పంటల బీమా నమోదు పురోగతి, రైతులకు అవగాహన కల్పించే చర్యలు, పంటల వారీగా బీమా అమలు, గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా చేపట్టాల్సిన ప్రచార కార్యక్రమాలు, రైతులకు సకాలంలో సేవలు అందించే అంశాలపై సమగ్రంగా ఆయన చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పంటల బీమా పథకాల ముఖ్య ఉద్దేశాలు, రైతులకు కలిగే ప్రయోజనాలు, నమోదు విధానం, చివరి తేదీలు, ప్రీమియం వివరాలను ప్రతి గ్రామంలోని రైతులకు విస్తృతంగా తెలియజేయాలని అధికారులకు సూచించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి అర్హులైన ప్రతి రైతు నిర్ణీత గడువులోపు పంటల బీమాలో నమోదు అయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఖరీఫ్-2026 సీజన్‌కు వరి, వేరుశెనగ, పత్తి, నిమ్మ పంటలు బీమా పరిధిలో ఉన్నాయని తెలిపారు. దిగుబడి ఆధారిత పంటల బీమా పథకాన్ని టాటా ఏఐజీ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ, వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాన్ని ఇఫ్కో టోకియో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ అమలు చేస్తున్నట్లు వివరించారు.

❖ ఖరీఫ్-2024 వరకు ఈపంట ఆధారంగా ఉచిత పంటల బీమా అమలులో ఉండగా, రబీ-202425 నుంచి రుణగ్రహీత, రుణేతర రైతులకు స్వచ్ఛంద నమోదు విధానం అమలులో ఉందని తెలిపారు. కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా పంట రుణం పొందిన రైతులు బీమాకు అర్హులని, రుణేతర రైతులు కూడా అధీకృత కేంద్రాల ద్వారా నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పంటల బీమాలో నమోదు చేసుకునేందుకు ఆధార్ కార్డు, భూ యాజమాన్య పత్రాలు లేదా కౌలు రైతులకు లీజు పత్రం, సాగు విస్తీర్ణ ధృవీకరణ పత్రం, బ్యాంకు పాస్‌బుక్ మొదటి పేజీ లేదా రద్దు చేసిన చెక్కు, మొబైల్ నంబరు తప్పనిసరిగా సమర్పించాలని తెలిపారు. బ్యాంకులు, సాధారణ సేవా కేంద్రాలు, జాతీయ పంటల బీమా నమోదు వేదిక, గ్రామ సచివాలయాలు, తపాలా కార్యాలయాల ద్వారా నమోదు చేసుకోవచ్చని సూచించారు.

❖ ఖరీఫ్-2026 సీజన్‌కు వరి పంటకు ఎకరానికి రూ.42,000 బీమా మొత్తానికి రైతు వాటా రూ.840, చివరి తేదీ ఆగస్టు 15, వేరుశెనగకు రూ.28,000 బీమా మొత్తానికి రూ.280, చివరి తేదీ జూలై 31, పత్తికి రూ.40,000 బీమా మొత్తానికి రూ.2,000, చివరి తేదీ జూలై 24, నిమ్మ పంటకు రూ.48,000 బీమా మొత్తానికి రూ.2,400, చివరి తేదీ జూలై 24గా నిర్ణయించినట్లు వివరించారు. ప్రీమియం చెల్లింపు, బీమా నమోదు గడువులు, పథకాల ప్రయోజనాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పంటల బీమా అమలులో ఎలాంటి నిరక్ష్యం లేకుండా ప్రతి అర్హత ఉన్న రైతు నమోదు అయ్యేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ముందు జిల్లా వ్యవసాయ అధికారి పి. సత్యవాణి పంటల బీమా అమలు విధానం, ప్రీమియం వివరాలు, రైతుల నమోదు ప్రక్రియ, సంబంధిత మార్గదర్శకాలను సమావేశంలో వివరించారు. అనంతరం జిల్లాలో పంటల బీమా కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి ప్రతి అర్హత కలిగిన రైతుకు పథకం ప్రయోజనం అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి పి. సత్యవాణి, జిల్లా ఉద్యానవన అధికారి కె. అనురాధ, నాబార్డ్ జిల్లా అభివృద్ధి అధికారి డాక్టర్ బాబు, లీడ్ జిల్లా మేనేజర్ మునిశేఖర్, జిల్లా ప్రణాళికాధికారి లక్ష్మీ నరసింహులు, ఇరిగేషన్ సూపరింటెండింగ్ ఇంజనీర్ దేశి నాయక్, జిల్లాలోని ఉప వ్యవసాయ సంచాలకులు, టాటా ఏఐజీ పంటల బీమా సంస్థ, ఇఫ్కో టోకియో జనరల్ ఇన్సూరెన్స్ సంస్థ సాంకేతిక నిపుణులు, వ్యవసాయ శాఖ అధికారులు, బ్యాంకర్ల ప్రతినిధులు, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియలో రాజకీయ పార్టీల సహకారం కీలకం

- గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా



**నెల్లూరు, జూలై 22, ప్రభాతవార్త - కలెక్టరేట్** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా కోరారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో డిఆర్వో విజయకుమార్‌తో కలసి ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతి, ప్రీమ్యాపింగ్, అనామలి కేసులు, బీఎల్‌వోలు, బీఎల్ఏల పాత్ర తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 19,74,240 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. వీరిలో 9,62,575 మంది పురుషులు, 10,11,452 మంది మహిళలు, 213 మంది ఇతరులు ఉన్నారని వివరించారు.

ఎస్ఐఆర్ ప్రీమ్యాపింగ్ ప్రక్రియలో ప్రారంభంలో 66 శాతం మ్యాపింగ్ పూర్తయి ఉండగా, ప్రస్తుతం అది 82.62 శాతానికి చేరుకుందని తెలిపారు. ప్రస్తుతం 45,890 కేసులు మాత్రమే మ్యాపింగ్ కానివిగా ఉన్నాయని పేర్కొన్నారు.

అదేవిధంగా 2,44,874 అనామలి కేసులు గుర్తించబడినట్లు తెలిపారు. మ్యాపింగ్ కాని కేసులు, అనామలి కేసులకు మాత్రమే సంబంధిత ఓటర్లకు నోటీసులు జారీ చేయనున్నట్లు చెప్పారు. జిల్లాలో 80,405 మంది మరణించిన ఓటర్లు గుర్తించబడినట్లు తెలిపారు. వీరికి సంబంధించి మరణ ధృవీకరణ పత్రం లేదా పంచనామా వంటి ఆధార పత్రాల ఆధారంగా జాబితా నుంచి తొలగింపు చర్యలు చేపడతామని పేర్కొన్నారు. అలాగే 37,484 డూప్లికేట్ ఓటర్లు, 67,384 గైర్హాజరు ఓటర్లు, 1,10,273 శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లు గుర్తించబడినట్లు తెలిపారు. బీఎల్ఏల పరిధిలోని గైర్హాజరు, శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్ల వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ బీఎల్ఏల ద్వారా సంబంధిత బీఎల్‌వోలతో సమన్వయం చేసుకొని ఒకటి లేదా రెండు రోజుల్లో క్షేత్రస్థాయిలో ధృవీకరించాలని, సాధ్యమైనంత వరకు గైర్హాజరు ఓటర్లను తిరిగి గుర్తించేలా సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఈ నెల 24న జిల్లాలోని అన్ని బీఎల్‌వోలు, బీఎల్ఏలతో మరో సమావేశం నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆ సమావేశంలో ఎస్ఐఆర్ ప్రక్రియ, మ్యాపింగ్ స్థితి, అనామలి కేసులు, ఇతర ఏఎస్‌డీడీ అంశాలపై విస్తృతంగా చర్చిస్తామని చెప్పారు. ఈ సమావేశానికి బహుజన సమాజ్ పార్టీ నుంచి బి. శ్రీరాం, భారతీయ జనతా పార్టీ నుంచి బైరి శ్రీనివాస్, వై. రాజేష్, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా నుంచి కె. శ్రీనివాసులు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ నుంచి టి. బాల సుధాకర్, తెలుగు దేశం పార్టీ నుంచి వి. భువనేశ్వర ప్రసాద్, వి. సురేంద్రబాబు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఎం.వి. శేషయ్య పాల్గొన్నారు.

## నేడు వెంకటాచలం గ్రామ పంచాయతీలో పల్లెవీక్షణం

- అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను స్వయంగా పరిశీలించనున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు, జూలై 22, ప్రభాతవార్త - కలెక్టరేట్** గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలును క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించడమే లక్ష్యంగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల చేపట్టిన పల్లెవీక్షణం కార్యక్రమం ఈనెల 23న గురువారం వెంకటాచలం మండలం వెంకటాచలం గ్రామ పంచాయతీలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో అమలవుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పరిశీలించడంతో పాటు ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలను సమీక్షించనున్నారు. పర్యటనలో భాగంగా వడ్డిపాలెంలో ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) కింద చేపట్టిన ఫీల్డ్ ఛానల్ పునరుద్ధరణ పనులను పరిశీలిస్తారు. అనంతరం జల జీవన్ మిషన్ ఆధ్వర్యంలో నిర్మించిన ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్‌ను సందర్శించి తాగునీటి సదుపాయాలను సమీక్షిస్తారు. అలాగే వీరన్న కానుపూరు చెరువు కట్ట అభివృద్ధి పనులను పరిశీలించి సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు ఇవ్వనున్నారు.

తదుపరి వెంకటాచలం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను సందర్శించి వైద్య సేవలపై సమీక్ష నిర్వహిస్తారు. అనంతరం గ్రామ సచివాలయంలోని రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి ఛాంపియన్ రైతుతో ముఖాముఖి నిర్వహించడంతో పాటు రైతులకు పీఎండీఎస్ కిట్లను పంపిణీ చేయనున్నారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు పశుగ్రాస విత్తనాలు, పశుగ్రాసాన్ని పంపిణీ చేయనున్నారు. అనంతరం సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్ (ఎస్‌డబ్ల్యూపీసీ) షెడ్‌ను పరిశీలిస్తారు. వడ్డిపాలెంలో ఇంటింటా చెత్త సేకరణ, తడిపొడి చెత్త వేరు చేసే విధానంపై గ్రామస్తులతో మాట్లాడుతారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి అక్కడ అందుతున్న సేవలను పరిశీలిస్తారు. వెలుగు సెర్ప్ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశమై వారి కార్యకలాపాలను తెలుసుకుంటారు. చివరగా గ్రామ ప్రజలతో కలెక్టర్ నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకుని, ఫిర్యాదులను స్వీకరించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నారు.

## జగన్‌తో పొగాకు రైతుల సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి



**నెల్లూరు, జూలై 22, ప్రభాతవార్త - వైద్యం :** నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి తాడేపల్లిలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డితో పొగాకు రైతులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో పలు విషయాలు చర్చించారు. పొగాకు రైతుల సమావేశంలో వివిధ జిల్లాల పొగాకు రైతులతో వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్.జగన్ భేటీ అయ్యారు.పొగాకు ధరల సంక్షోభం, కొనుగోళ్లలో తీవ్ర జాప్యంపై రైతులతో వైయస్.జగన్ చర్చించారు. వేలం ప్రారంభమై 94 రోజులు గడిచినా పొగాకు కొనుగోళ్లు పూర్తికాలేదని రైతుల ఆవేదన వ్యక్తం చేశారు.సాధారణంగా జులై నాటికి ముగియాల్సిన అమ్మకాలు ఇప్పటికీ కొనసాగడంతో రైతులు ప్రమాదకరమన్నారు. ఏపీలో సరుకు అమ్ముడవక ముందే మైసూరులో వేలం ప్రారంభమైతే వ్యాపారులు అక్కడికి వెళ్లిపోతారని ఆందోళన చెందారు. కొన్ని వేలం కేంద్రాల్లో 30 నుంచి 40 శాతం వరకు నో బిడ్స్, రిజెక్షన్లు నమోదవుతున్నాయని రైతులు వెల్లడించారు. తిరస్కరించిన ఒక్కో బేలును మళ్లీ వేలానికి తీసుకురావడానికి కనీసం 1,000 రూపాయలు అదనపు భారం పడుతోందని రైతులు తెలిపారు. ఒక్కో బ్యారన్‌పై రైతుకు 5 లక్షల రూపాయలు వరకు నష్టం వచ్చే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. పొగాకు రైతులకు ఆత్మహత్యలే శరణ్యమన్న దుస్థితి వచ్చిందని రైతుల వ్యాఖ్యనిం చారు. పోలవరంలో పొగాకు రైతు ఆత్మహత్య చేసుకున్నారని సమావేశంలో రైతులు వెల్లడించా రు. 80-85 మిలియన్ కిలోల పంటలో కేవలం 7 మిలియన్ కిలోలే కొనుగోలు చేశారని ఏలూరు, గోదావరి రైతులు వెల్లడించారు. పంట వేసే సమయంలో ఎక్కువగా సాగుచేయాలని ప్రోత్సహించిన కంపెనీలు వేలం సమయానికి సిండికేట్‌గా మారాయని ఆరోపించారు. పొగాకు బోర్డు రైతుల ను వదిలేసి వ్యాపార వర్గాలకు కొమ్ముకాస్తోందని రైతుల మండిపడ్డారు. 200రూపాయలకు తగ్గకుం డా కొనాలని చంద్రబాబు చెప్పినా వ్యాపారులు పట్టించుకోలేదని రైతుల విమర్శించారు. రైతుల ఆందోళనలను పోలీసులతో అణచివేస్తూ కేసులు పెడుతున్నారని కందుకూరు రైతుల ఆరోపించారు. జగన్ ప్రభుత్వంలో మార్క్‌ఫెడ్ జోక్యంతో కొనుగోళ్లలో పోటీ ఏర్పడి రైతులకు మంచి ధరలు వచ్చాయని రైతుల గుర్తుచేశారు.ఇప్పుడు ఉన్న పొగాకునే కొనకుండా వచ్చే ఏడాదికి ఇండెంట్ ఇవ్వడం ఏమిటని రైతులు ప్రశ్నించారు. జగన్ కదిలితేనే ప్రభుత్వం కదులుతుందని, రైతుల తరఫున ఆయన పోరాటమే తమకు శరణ్యమని రైతుల స్పష్టం చేశారు.

## సంగం బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జాయింట్ కలెక్టర్



**సంగం జులై 22 ప్రభాతవార్త** సంగం బాలికల గురుకుల పాఠశాలను జాయింట్ కలెక్టర్ మొగలి వెంకటేశ్వర్లు ఆకస్మికంగా తనిఖీ చేశారుజ పాఠశాల డైనింగ్ హాల్‌ను పరిశీలించి విద్యార్థులతో కలిసి బోజనం చేసిన ఆయన నాణ్యతగా ఉందని సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణ, పరిశుభ్రత, మౌళిక వసతులను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న విద్య,వసతి, బోజన సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంగం తహసిల్దారు కార్యాలయాన్ని పరిశీలించారు. తహసిల్దారు కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతు జిల్లా వ్యాప్తంగా 690 రెవిన్యూ గ్రామాలలో దశలవారీగా కొనసాగుతున్న రీ సర్వే పనులు,ఇప్పటికే 314 గ్రామాల్లో పూర్తి కాగా మిగిలిన గ్రామాల్లో వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు. ఆగష్టు 1 నాటికి రైతులకు మరో విడత పట్టాదారు పాస్‌పుస్తకాల పంపణికి పూర్తి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. రీసర్వేలో తలెత్తిన చిన్నపాటి పొరపాట్లు సవరణకు పకడ్బంది చర్యలు తీసుకొంటున్నట్లు తెలిపారు. పీజిఆర్ఎస్ ద్వారా వచ్చే భూ దారి వివాదాలను క్షేత్రస్ధాయిలో విచారించి వెంటనే పరిష్కరించాలని రెవిన్యూ అదికారులను ఆదేశించారు. తహసిల్దారు సారంగపాణి, రెవిన్యూ అధికారులున్నారు.



## ఇసుక రవాణా సమయంలో ప్రమాణాలు పాటించాలి



**నెల్లూరు కార్పోరేషన్, జులై 22 ప్రభాతవార్త :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో భవన నిర్మాణాలకు అవసరమైన ఇసుక రవాణా సమయంలో నిర్దేశించిన ప్రమాణాలు పాటించని వాహనదారులపై మున్సిపల్ యాక్టు చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ వైఓ.నందన్ హెచ్చరించారు. స్థానిక పోర్లు కట్టప్రాంతం ఇసుక రీచ్ నుంచి పొట్టేపాలెం ఇసుక రీచ్ ప్రాంతం వరకు కమిషనర్ బుధవారం పర్యటించి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్లతో మాట్లాడారు. పరిమితికి మించి ఇసుక తరలింపు సమయంలో రోడ్లపై పేరుకుపోయిన ఇసుకను ట్రాక్టర్ డ్రైవర్లకు కమిషనర్ ప్రత్యక్షంగా వీడియో చూపించి వివరణ అడిగారు. రాత్రి వేలల్లో ట్రాక్టర్ డ్రైవర్లు నిర్లక్ష్యంగా ఇసుకను తరలిస్తూ రోడ్లపై ఇసుక మేటలు వేసేలా వాహనాలు నడుపుతున్నారని, ఉదయం వేలకు ఆ ఇసుకను రోడ్లపై నుంచి తొలగించేందుకు పారిశధ్య కార్మికులకు అదనపు పనిభారం పడుతోందిన ఆగ్రహం వ్యక్తం చేశారు. కంకరి, ఇసుక భవన నిర్మాణ సామాగ్రి తరలించే సమయంలో లారీలు, ట్రాక్టర్లు, ఎడ్లబండ్లు ఇతర వాహనాలపై పూర్తిసాయిలో నగరపాలక సంస్థ నిర్దేశించిన భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా వాహనాల యజమానులు పాటించాలని నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామనికమిషనర్ హెచ్చరించారు.

## కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

- జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారపు రెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి



**నెల్లూరు, జూలై 22, ప్రభాతవార్త - అగ్రికల్చర్ :** నీట్ పేపర్ల లీకేజ్, విద్యార్థుల ఆత్మ హత్యలకు కారణమైన కేంద్ర విద్య శాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారపు రెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. నెల్లూరులోని విఆర్‌సి వద్ద అంబేద్కర్ కూడలిలో పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి నినాదించారు. ర్యాలీగా సాగిన కాంగ్రెస్ శ్రేణుల మధ్య మాట్లాడుతూ ఢిల్లీలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విద్యార్థులకు మద్దతు ప్రకటిస్తే ఈడ్చికెల్లారని, బిజెపి నిరంకుశ విధానాలు విడనాడాలని ప్రజాస్వా మ్యాన్ని కాపాడాలని కోరారు. ప్రధాన కార్యదర్శి కే సంజయ్ మాట్లాడుతూ ఆడ మగ తేడా లేకుండా ఢిల్లీలో పోలీసులు లాఠీచార్జి చేశారని ఇది ప్రజా హక్కుల మీద దాడి అని అన్నారు.

**డాక్టర్ యశోదర మాట్లాడుతూ** బిజెపి ప్రభుత్వం పరీక్షల విషయాలలో నమ్మకాన్ని కోల్పోయ్యిందని అన్నారు. సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు ఇర్ఫాన్ ఉపాధ్యక్షులు బాల సుధాకర్, రూరల్ నాయకులు మల్లికార్జున్ రెడ్డి, హాజీ మహమ్మద్ హనీఫ్, డాక్టర్ ప్రసాద్, అష్రాఫ్, అజావుద్దీన్, సేవాదళ్ సుజాత, రాజా, కిషోర్, సుధాకర్, ముద్దిగుంట శ్రీనివాసులు, రఫీ, పుట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## టౌన్‌ప్లానింగ్ అధికారులతో కమిషనర్ సమీక్ష



**నెల్లూరు కార్పోరేషన్, జులై 22 ప్రభాతవార్త :** నెల్లూరు నగరపాలకసంస్థ కమిషనర్ వైఓనందన్ కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో టౌన్‌ప్లానింగ్ సిబ్బందితో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశాల మేరకు పట్టణ ప్రణాళిక విభాగంలో భవన నిర్మాణ అనుమతులను సరళీకృతం చేశారనీ, అనుమతులు మేరకే భవన నిర్మాణాలు జరిగేలా నిరంతరం టౌన్‌ప్లానింగ్ అధికారులు, వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పర్యవేక్షించాలని సూచిం చారు. ఎల్ఆర్ఎస్ పథకం అమలుకు పూర్తిస్తాయిలో చర్యలు తీసుకోవాలని పథకం ద్వారా కలిగే లబ్దిని గురించి విస్తృతస్థాయిలో ప్రజలకు అవగాహన ప్రచారం కల్పించాలని సూచించారు ప్లానింగ్ కార్యదర్శుల లాగిన్లలో ఉన్న ఎల్ఆర్ఎస్ పాటర్న్లు పరిశీలించి వెంటనే తదుపరి అనుమతుల కోసం అధికారులకు పంపాల్సిందిగా ఆదేశించారు. విధుల నిర్వహణలో ప్రతి ఒక్కరూ నిబద్ధత పాటించి టౌన్‌ప్లానింగ్ విభాగం సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్పోరేషన్ ఆదాయాన్ని పెంచేందుకు ప్రతి ఒక్క టౌన్‌ప్లానింగ్ విభాగం అదికారి సచివాలయ ప్లానింగ్ అండ్ రెగ్యులైజేషన్ కార్యదర్శి కృషి చేయాలని సూచించారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నక్ష ప్రాజెక్టు పనుల పురోగతిని మరింత వేగవంతం చేసి నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. నక్ష ప్రాజెక్టు నిర్వహణకు కేటాయించిన సిబ్బంది అందరూ విధులు నిర్వహనలో నిబద్ధతతో వ్యవహరించి ప్రాజెక్టును విజయవంతం చేసేందుకు కృషి చేయాలని కమిషనర్ సూచించారు. ఈ సమావేశంలో నెల్లూరు నగర పాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగం సిటీ ప్లానర్ రఘునాథ్‌రావు, అసిస్టెంట్ సిటి ప్లానర్‌లు వేణు, సతీష్, సూపరింటెండెంట్ ప్రవీణ్‌కుమార్, టీపీబిఓలు, ప్లానింగ్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వెలగపూడి సుబ్రమణ్యేశ్వర రావు పెద్ద కర్మలో పాల్గొన్న తానంకి నానాజీ



**చిల్లకూరు, జూలై 22, ప్రభాతవార్త :** మండలంలోని పాలిచర్లవారిపాలెం గ్రామ సీనియర్ టిడిపి నాయకులు ప్రదీప్ నాయుడు తండ్రి వెలగపూడి సుబ్రహ్మణ్యేశ్వర రావు పెద్దకర్మ కార్యక్రమంలో పెంచలకోన ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ తానంకి నానాజీ పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో పెద్దదిక్కుగా పనిచేసిన వెలగపూడి సుబ్రమ ణ్యేశ్వర రావు లేకపోవడం బాధాకరమని పార్టీకి తీరని లోటు అన్నారు. ఆయనతో పాటు చిల్లకూరు మండల టిడిపి అధ్యక్షులు దువ్వూరు రాజశేఖర్ రెడ్డి, ఉచ్చూరు వెంకటేశ్వర్లు రెడ్డి, మేకల కుమార్, యదనపర్తి భాస్కర్ రెడ్డి, సరుపూరు నాగేశ్వరరావు, మండల టిడిపి నాయకులు, పాలిచర్లవారిపాలెం గ్రామ కూటమి నాయకులు, కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకంపై రైతులకు అవగాహన



**దగదర్తి, జూలై 22, ప్రభాతవార్త :** దగదర్తి మండలంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పంటల బీమా పథకంపై రైతులకు అవగాహన కల్పించేందుకు పొలం పిలుస్తోంది కార్యక్ర మంలో భాగంగా బుధవారం దామవరం, దగదర్తి గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి ఎస్.రామ్మో హన్ రైతులతో సమావేశమై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన రైతులు పంట బీమా పథకంలో తప్పనిసరిగా నమో దు చేసుకోవాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాలు, అధిక వర్షాలు, అనావృష్టి, తుఫానులు తదితర కారణాలతో పంట నష్టపోయిన సందర్భాల్లో పంటల బీమా రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తుందని, అవసరమైన రైతులు ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలు, భూ రికార్డులు తదితర పత్రాలతో గ్రామ వ్యవసాయ సహాయకులను లేదా సమీప రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని సూచించారు. రైతులు సాగు చేసిన ప్రతిఎకరాకు సక్రమంగా నమోదు చేయించుకోవడం ద్వారా భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా బీమా ప్రయోజనాలు పొందవచ్చని తెలిపారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ పథకం కింద ఎకరానికి వరి పంటకి 840 రూపాయలు, వేరుశనగ పంటకి రూ.280లు ప్రీమియం చెల్లించాల్సి ఉందన్నారు. ఈ బీమా పథకంలో చేరేందుకు వేరుశనగ పంటకు జూలై 31వ తేదీ, వరి పంటకు ఆగష్టు 15 చివరి తేదీగా నిర్ణయించారు. దామవరం, దగదర్తి గ్రామాల్లో వరి, వేరుశనగ పంటలను పరిశీలించి పురుగులు, తెగుళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ చరణ్, వీఏఏలు శ్రీకాంత్, సాయి, రైతులు పాల్గొన్నారు.

## ప్రైవేటు పాఠశాలల నందు విద్యార్థుల తల్లిదండ్రులచే లీప్ యాప్ ఇన్‌స్టాల్ చేయించిన ఎంఈఓ



**ఉదయగిరి, జులై22, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరి మండల విద్యాశాఖాధికారి టి.వెంకటేశ్వర్లు సెయింట్ మేరీస్ ప్రైవేటు ఉన్నత పాఠశాల, హోలీ ఏంజెల్స్ ప్రైవేటు ఉన్నత పాఠశాల, శ్రీకృష్ణదేవరాయ ప్రైవేటు ఉన్నత పాఠ శాల, రేడియన్స్ ప్రైవేటు ఉన్నత ఉదయగిరి పాఠశాలల పరిధిలోని విద్యార్థుల తల్లిదండ్రులచే మండల విద్యాశాఖాధికారి ఆధ్వర్యంలో ప్రధానో పా ధ్యాయులు, ఉపాధ్యాయుల పర్యవేక్షణలో లీప్ యాప్ ఇన్‌స్టాల్ చేయించడం జరిగింది. ఈ సందర్భంగా విద్యాశాఖాధికారి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు తమ తమ మొబైల్ ఫోన్స్ నందు లీప్ యాప్ తప్పనిసరిగా ఇన్‌స్టాల్ చేయించుకోవాలని, లీప్ యాప్ ఇన్‌స్టాల్ చేయించడమే కాక అది ఏవిధంగా ఓపెన్ చేయాలి పాస్‌వర్డ్ ఏ విధంగా క్రియేట్ చేసుకోవాలి లీప్ యాప్ ఇన్‌స్టాల్ చేయించుకోవడం వలన విద్యార్థుల తల్లిదండ్రులకు ఎంతో సమాచారం తెలుస్తుందని, ఎంతగానో ఉపయోగపడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రైవేటు ఉన్నత పాఠశాలల కరస్పాండెంట్లు శ్రీకృష్ణ దేవరాయ ప్రైవేటు ఉన్నత పాఠశాల భాస్కర్‌రెడ్డి, హోలీ ఏంజెంట్స్ ప్రైవేటు ఉన్నత పాఠశాల సుధాకర్, గోమతి ప్రైవేటు ఉన్నత పాఠశాల ప్రసాద్, రేడియన్స్ ప్రైవేటు ఉన్నత పాఠశాల మసూద్, సెయింట్ మేరీస్ ప్రైవేటు పాఠశాల ఫాదర్ బాలరాజు, ప్రధానోపాధాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దాతృత్వం

**- సాయిబాబా ఆలయానికి టన్ను బియ్యం వితరణ**



**ఉదయగిరి, జులై 22, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరి బీసీ కాలనీలో ఉన్న సాయిబాబా ఆలయానికి సేవా కార్యక్రమంలో భాగ ంగా టన్ను బియ్యాన్ని విరాళంగా అందజేసి సమాజ సేవలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో యువ కులు స్వచ్ఛందంగా పాల్గొని ఆలయానికి అవసరమైన బియ్యాన్ని సమర్పించారు. ఈ సందర్భ ంగా యువత ప్రతినిధులు మాట్లాడుతూ సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి ఉపయోగపడే పనులు చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఆలయాల్లో నిర్వహించే అన్నదాన కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని చెప్పారు.

## 23 నుంచి గురుపూర్ణిమ సప్తాహ మహోత్సవాలు



**కోవూరు, జూలై22ప్రభాతవార్త :** కోవూరులోని జాతీయ రహదారిలో వెలసి ఉన్న షిరిడీ సాయి బాబా మందిరంలో 24వ గురుపూర్ణిమ సప్తాహ మహోత్సవాలు ఈ నెల 23వ తేది నుంచి 7 రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకురాలు పచ్చిపాల సుజాత తెలిపారు. ఈ ఉత్సవాలను పుర స్కరించుకుని ఆలయాన్ని విద్యుద్దీపాలతో అత్యంత వైభవంగా అలంకరించారు. ఈ మహోత్సవాల్లో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.

## ప్రకృతి వైపరీత్యాల నుండి రక్షణకు పంటల భీమా తప్పనిసరి



**సంక్రాంతివల్లి(రాపూరు), జూలై22ప్రభాతవార్త :** ప్రకృతి వైపరీత్యాల నుండి రక్షణకు రైతులు తప్పని సరిగా పంటల బీమాను చేయించుకోవాలని రాపూరు మండల వ్యవసాయాధికారి సోమ సుందర్ కోరారు. బుదవారం రాపూరు మండలంలోని సంక్రాంతిపల్లి, వేపినాపి గ్రామాలలో ఆయన పోలం పిలుస్తోంది నిర్వహించారు. రైతులతో సమావేశమైన వ్యవసా యాధికారులు మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు అయిన అధిక వర్షాలు, కరువు, తుఫాన్లు వంటి అనూహ్య పరిస్థితుల వల్ల పంటలకు నష్టం సంభవించే అవకాశం వున్నందున ప్రతి రైతు తప్పని సరిగా వారి పంటలకు బీమా చేయించుకోవాలన్నారు. తద్వారా ప్రకృతి వైపరీత్యాలు సంబవించినపుడు నష్ట పరిహారం పొందవచ్చని తెలిపారు. నిమ్మ తోటలకు ఎకరాకు రూ. 2,429 వరి పంటలకు రూ.840 చోప్పున ప్రీమియం చెల్లించి సమీప కామన్ సర్వీస్ సెంటర్‌లో క్రాప్ ఇన్యూరెన్స్ చేసుకోవచ్చన్నారు. మండలంలోని రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వరి పంట బీమా నమెదు ఆగష్టు 15 వరకు వుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు వున్నారు.

## 396 జీఓని రద్దు చేయాలని మోకాళ్ళపై వినూత్న నిరసన



**కావలి, జులై 22 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన జీఓని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కావలి సబ్ రిజిష్టర్ కార్యాలయం వద్ద డాక్యుమెంట్ రైటర్లు డిటిపి ఆపరేటర్లు బుధవారం మోకాళ్ళపై కూర్చొని వినూత్న రీతిలో తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ కేంద్రాల ఏర్పాటుతో ప్రజలకు మేలు జరుగుతుందంటూ ప్రభుత్వం చెబుతున్న మాటలు మోసపూరితమైనవని వాటిని నమ్మే పరిస్థితిలో తాము లేమని స్పష్టం చేయడం జరిగింది. జీవనోపాదికై ఎన్నో ఏళ్ళుగా సబ్‌రిజిష్టార్ కార్యాలయాల వద్ద ప్రజలకు సేవలు అందిస్తూ జీవిస్తున్న తమ పొట్ట కొట్టేలా జీఓనెంబర్ 396 ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రభుత్వం నిలిపివేసే వరకు పెన్‌డౌన్ కార్యక్రమాన్ని విరమించేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు పిడివిఎం ప్రసాద్, అద్యఓఉలు అమెరిశెట్టి వెంకట్రావు, కార్యదర్శి షేక్ పార్థు, టెజరర్ ఉప్పాల రాంప్రసాద్ జాయింట్ సెక్రటరీ గుడిపల్లి వెంకట్రావు, జాయింట్ ట్రెజరర్ బెజవాడ ప్రసన్నకుమార్, సర్రాజు శ్రీనివాసులు, వినుకోట పవన్ కుమార్, సంఘం నాయకులతో పాటు డాక్యుమెంట్ రైటర్లు, డిటిపి ఆపరేటర్లు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులపై వేధింపులు ఆపాలి




**కావలి, జులై 22 ప్రభాతవార్త :** కావలి మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులపై వేధింపులను ఆపాలని ఏపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం పురపాలక సంఘం నందు నిరసన చేపట్టారు. అనంతరం కార్మిక సమస్యలను పరిష్కరి ంచాలని కోరుతూ కమిషనర్‌కు వినతిపత్రం అంద జేశారు. యూనియన్ అధ్యక్ష కార్య దర్శి ఏండ్లురి ఆది నారాయణ, తన్నీరు వెంకటేష్‌లు మాట్లాడుతూ భార్యాభర్తలు ఒకేచోట పనిచేయడానికి చట్టపరంగా వెసులు బాటు ఉన్న శానిటరీ ఇన్స్‌పెక్టర్ బషీర్ కార్మికులను విధులకు ఆపడం వేదించడం చట్ట విరుద్ధమన్నారు. కార్మికులు యాదావిధిగా పనులు కొనసాగించాలని కోరారు. కార్మికులు మరణించిన వారికి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని తెలిపారు. రోజువారి కార్మికులను ఆప్కాస్‌లో చేర్చాలని కోరారు. ప్రతినెల 1న జీతాలు ఇవ్వాలన్నారు. ఏఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి అంకయ్య, గౌరవ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, శ్రీలక్ష్మి, ప్రభావతి, రాజేష్, అద్దూర్ నాగరాజ్, గుంజి వెంకయ్య కార్మికులు పాల్గొన్నారు.

## నేడు ఎమ్మెస్సార్‌లో మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్



**కావలి, జులై 22 ప్రభాతవార్త :** కావలి కో-ఆపరేటీవ్ కాలనీలోని ఎమ్మెస్సార్ డిగ్రీ కళాశాలలో నేడు మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల కరస్పాండెంట్ గుంటుపల్లి రాజ్‌కుమార్ చౌదరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగబా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఉపాధి అవకాశాలను కల్పించాలనే లక్ష్యంతో ఏపి రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఆధ్వర్యంలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి సహకారంతో మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్‌నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్లేస్‌మెంటు డ్రైవ్‌లో 34కంపెనీలు పాల్గొంటున్నాయని సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ మార్కెటింగ్ తదితర విభాగాల్లో 2వేలకు పైగా ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. రాయల్ ఎన్‌ఫీల్డ్, విష్ణుకార్స్, ముత్తూట్ ఫైనాన్స్, శ్రీరామ్ ఫైనాన్స్, వోల్టాస్ బ్లూ స్టార్ కియా మోటార్స్, ఆపోలో ఫార్మసి, బ్లింకిట్, బార్బెక్యూ నేషన్ డిక్సన్ టెక్నాలజీస్ వంటి ప్రముఖ సంస్థలు నియామకాలు చేపట్టనున్నాయని తెలిపారు. నియోజకవర్గంలో డిగ్రీ, ఇంజనీరింగ్ డిప్లమా, ఐటిఐ అర్హత కలిగిన యువత ఈ అవకావాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఇంటర్వ్యూకు ఆధార్, విద్యార్థుల సర్టిఫికెట్స్, పాస్‌పోర్టు సైజు ఫోటోలు తీసుకురావాలని తెలిపారు. 7893679141, 7969526149 ఫోన్‌నెంబర్లన సంప్రదించాలని తెలిపారు.

## ఎన్‌సిసి క్యాడెట్లకు ఉచిత రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు




**కావలి, జులై 22 ప్రభాతవార్త :** కావలి పాత ఊరు పురపాలక సంఘం ఉన్నత పాఠశాలలో కావలి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం 64మంది ఎన్‌సిసి క్యాడెట్స్‌కు ఉచిత రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సుజాత పాల్గొని ఎన్‌సిసి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ రక్తగ్రూపులపై అవగాహన కలిగి ఉండాలని తెలియజేస్తూ రక్తదానంపై అవగాహన కల్పించి భవిష్యత్తులో ఎన్‌సిసి విద్యార్థులు అందరూ రక్తదాతలుగా మారాలని పిలుపునిచ్చారు. ఎన్‌సిసి అధికారి మస్తాన్‌వలి మాట్లాడుతూ ఎన్‌సిసి క్యాండెంట్స్‌కు రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు చేసిన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి వారికి ధన్యవాదాలు తెలిపారు. టెక్నిషియన్స్ పద్మావతి, శేషమ్మ, ఎన్‌సిసి క్యాడెట్స్ పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో పాండురంగస్వామికి విశేష పూజలు



**కలువాయి జులై 22 ప్రభాతవార్త :** స్థానిక శ్రీరుక్మిణి పాండు రంగస్వామి దేవస్థానం నందు వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండోవ రోజు బుధవారం వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహిం చారు. కార్యక్రమంలో భాగంగా ఉభయకర్తలుస్వా మి అమ్మవార్లకు విశేష అలంకరణతోపాటు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అదే విధంగా దేవస్థానం నందు చిన్నారులకు ఆధ్యాత్మిక క్విజ్ పోటీలను సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని వేడుకలను తిలకించి స్వామి అమ్మవార్లను దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు ఉభయ కర్తలుగా సోమిశెట్టి ప్రసాద్, బారతి, కూరెళ్ళ దిలీప్‌కుమార్, లక్ష్మీకుమారి, సోమిశెట్టి గురు బ్రహ్మేశ్వరీరావు, లక్ష్మీకుమారి, సోమిశెట్టి కిషోర్, శారదా దంపతులు వారి కుటుంబసభ్యులు వ్యవహారించారు.

## చెరువుల సమస్యతో రెండు గ్రామాల మత్స్యకారుల వివాదం



**మనుబోలు జులై 22 ప్రభాతవార్త :** మనుబోలు మండల ంలోని లక్ష్మీ నరసింహపురం మరియు పిడూరు గ్రామాల మత్స్యకారుల మధ్య చెరువుల వివాదం చోటు చేసుకుంది. బుధవారం ఇరు గ్రామాల మత్యకారులను స్థానిక తహసి ల్దారు కార్యాలయంకి పిలిపించి వారితో చర్చలు జరిపిన మత్స్యశాఖ అధికారులు, డిఎస్‌పి ఘట్టమనేని శ్రీనివాసరావు మరియు తహసిల్దారు రమాదేవి గత 12 సంవత్సరాల క్రితం ఈ ఇరు గ్రామాల మత్స్యకారులు గ్రామ తీర్మానం చేసుకొని ఊర్లలోని చెరువులను పంచుకొని ఎవరికి వారు సొసైటీ లను ఏర్పాటు చేసుకొని చేపలు పట్టుకుంటున్నారు. కానీ పిడూరు మత్స్యకారులు లక్ష్మీ నరసింహపురం లోని బంగారమ్మ చెరువులో సభ్యత్వం కావాలి అని అడగడంతో ఈ వివాదం చోటు చేసుకుంది. మత్స్యశాఖ పోలీస్‌శాఖ, రెవిన్యూశాఖల అధికారుల జోక్యం తో ఇరువర్గాల వారితో స్థానిక తహసిల్దారు కార్యాలయంలో చర్చలు జరిపి నూతన సభ్యత్వాలు నమోదు చేస్తామని ఏ ఊరివాళ్ళు ఆ ఊరి చెరువులోని చేపలు పట్టుకొవాలని మీరు తీర్మానం చేసుకొని చెప్పినట్లు అయితే అప్పుడుస్థానిక వారికి పోను మిగిలిన వారికి అక్కడకు సభ్యత్వం ఇస్తామని చెప్పడంతో సమస్య సద్దుమణిగింది. ఈకార్యక్రమంలో మత్స్యశాఖ అధికారులు, ఎస్ఐ హనీఫ్, డిటి ప్రదీప్, ఆరుణ, ఇరుగ్రామాల మత్స్యకారులు పాల్గొన్నారు.

## ధరేంద్ర ప్రధాన్‌ను బర్తరఫ్ చేయాలి
## పిసిసి సభ్యులు టి.బాలసుధకార్ డిమాండ్

**కోట, జులై 22 ప్రభాతవార్త :** భాజపా అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ప్రశ్నపత్రాలను అమ్ముకుంటున్నారని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పిసీసీ సభ్యులు టి.బాలసుధాకర్ ఆరోపించారు. ఆయన కోటలో బుధవారం ప్రభాతవార్తతో మాట్లాడారు. నీట్ ప్రశ్న పత్రాలను పల్లీ బఠానీల్లా కోట్ల రూపాయలకు అమ్ముకున్నారని ధ్వజమెత్తారు. రాజకీయ పార్టీలకతీతంగా దేశ వ్యాప్తంగా నిరసనలు జరుగుతున్నాయని, ప్రజా ఆందోళనలు పరిగణలోకి తీసుకుని దర్మేంద ప్రధాన్‌ను కేంద్ర మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని బాలసుధాకర్ డిమాండ్ చేశారు. నీట్ ప్రశ్నపత్రాలను అమ్ముకున్న వారిని అరెస్టు చేసి జైల్లో పెట్టాలన్నారు. లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో ధర్మేంద్రప్రధాన్ చెలగాటం ఆడారని ఆయన రాజీనామా చేయాలని దీల్లిల్లో యువత ఆందోళన చేపట్టందిన్నారు. పార్లమెంటరీ వ్యవస్థలో ప్రజా సమస్యల్ని ప్రస్తావించడం ప్రజా ప్రతినిధుల బాద్యత 20 వ తేదీ నుంచి ప్రారంభమైన పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రశ్నపత్రాల లీకేజీ అంశంపై చర్చించాలని కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి అడిగినా ప్రభుత్వం అనుమతించడం లేదన్నారు. ప్రజాస్వామ్యానికి ఇది దురదృష్టకరమైన పరిస్దితి అని పేర్కొన్నారు.

## కేశవరంలో ఉచిత వైద్య శిబిరం



**కోట, జులై 22 ప్రభాతవార్త :** కోట మండలం కేశవరం గ్రామంలో బుధవారం నెల్లూరు నారాయణ ఆసుపత్రివారు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. నారాయణ వైద్య నిపుణులు కంటి శుక్లాల ఆపరేషన్లు చేయడం, మెలలు, ఆపెం డిసైటిస్, చెవిలో చీము కారడం, చెవిలో రంధ్రాలు ముక్కలో కండరాలు పెరడం, చర్మవ్యాధులు తదితర సమస్య లకు ఉచిత వైద్య సేవలను పొంద వచ్చునాని చెప్పారు. ఈ శిబిరా న్ని నాయకులు మాజీ సర్పంచ్, గురుస్వామి, చిట్టేడు సొసైటి మాజీ చైర్మెన్ ఉలవకాయల ప్రసాద్‌లు సందర్శించారు.

## ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తల సేమియా విభాగానికి దాతల సహకారం



**నెల్లూరు, జులై 22, ప్రభాతవార్త - వైద్యం :** నెల్లూరు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ లో తలసేమియా విభాగం ఎంతో ఖర్చుతో కూడుకున్నది. ఈ యూనిట్‌లో చిన్నారులకు మందుల కొనుగోలుకు భారీగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. అలాంటి తల సేమియా విభాగానికి పలువురు దాతలు ముందుకొచ్చి బుధవారం విరాళాలను అందజేశారు. నెల్లూరుకు చెందిన శ్రీనివాసన్ చక్రవర్తి వారి కుటుంబ సభ్యులు తల సేమియా యూనిట్లో చిన్నారులకు అవసరమైన మందుల కొనుగోలు నిమిత్తం 2,05,500 విరాళంగా అందజేశారు . అలాగే శ్రీ కుసుమ హరనాథ భక్త బృందం తల సేమియా చిన్నారుల కోసం 30,000 విరాళంగా అందజేశారు. దాతలు అందించిన ఈ ఉదార సహాయానికి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ కార్యదర్శి పి. మస్తానయ్య, తలసేమియా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్లు డా. సీత, కమలేష్ కుమార్ జైన్, డా. సర్వేపల్లి విజయ్ కుమార్, యలమూరి రంగయ్య నాయుడు, చమర్తి జనార్ధన్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తలసేమియా బాధిత చిన్నారుల సంక్షేమం కోసం మరిన్ని దాతలు, సేవా సంస్థలు ముందుకు వచ్చి సహకరించాలని రెడ్ క్రాస్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.

## కలిగిరమ్మ తిరుణాళ్లల్లో ఎడ్ల పందాలు




**కలిగిరి, జూలై22, ప్రభాతవార్త;** మండల కేంద్రమైన కలిగిరిలో గత నాలుగురోజులుగా శ్రీ కలిగిరమ్మ తిరుణాళ్ల కన్నుల పండుగగా జరుగుతున్నాయి. ఈ వేడుకలను చూసేందుకు బక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తున్నారు. తిరుణాళ్లల్లో 4వ రోజైన బుధవారం అమ్మ వారికి బక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు చేయించారు. తిరుణాళ్లను పురస్కరించుకొని కలిగిరిలో ఎడ్ల పందాలు బారీ ఎత్తున నిర్వహించారు. ఈ పందాలలో గెలపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కాగా ఎడ్ల పోటీలను కలిగిరి యస్ఐ లాంచనంగా ప్రారంబించారు.

## కలిగిరి యస్ఐని కలిగిసిన ధళిత సంఘనేతలు.



**కలిగిరి;జూలై22, ప్రభాతవార్త;** జలదంకి ఎస్సైగా పనిచేస్తూ బదిలీపై కలిగిరికి వచ్చిన నూతన యస్ఐయస్‌డి. లతీఫున్నీసాను బుదవారం కలిగిరి మండలదళిత ఐఖ్యవేదిక కన్వీనర్ ఎంవి రమణయ్య కలిగిరి పోలీస్ స్టేషన్‌లో మర్యాద పూర్వకంగా కలి శారు. అనంతరం యస్ఐకి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛంతో సత్కరించారు. సంఘాలలో ఉన్న కొన్ని సమస్యలు యస్ఐ దృష్టికి తెచ్చారు. ఈకార్యక్రమంలో ఆరేటి తిరిపాలు, చిన్ని కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## క్రిష్ణారెడ్డిపాళెం, చిన్న అన్నరుల్లో పొలం పిలుస్తుంది



**కలిగిరి, జూలై22, ప్రభాతవార్త;** కలిగిరి మండలంలోని క్రిష్ణారెడ్డిపాళెం, చిన్న అన్నలూరుగ్రామాలలో వ్యవ సాయ శాఖ అధికారులు బుదవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్బంగా మండల వ్యవసాయాధికారి యస్‌కె. జహీర్ మాట్లాడుతూ పంటలు సాగు చేసే ప్రతి రైతు తప్పని సరిగా ఈ క్రాపు చేయించుకోవాలన్నారు. ప్రస్తుతం యల్‌నిఓ ప్రభావం వలన వర్షాలు సరిగా పడకపంటలు సాగుచేసుకొనే రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనివల్ల పంట దిగుబడులు తగ్గి రైతు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. అందు చేత పంటలు సాగు చేసుకున్న రైతులు ప్రదాన మంత్రి పసల భీమా పథకం ద్వారా ఎకరానికి వరి పంటకైతే రు.840లువేరుశనగపంటకైతై రు.280లు లెక్కన మీదగ్గరలోని మీసేవ కేంద్రాల ద్వారా, లేదా కామన్ సర్వీసెస్ సెంటరులోగానీ చెల్లించిపంట భీమా పదకంలో పేరు నమోదు చేసుకోవాలన్నారు. నమోదుకు చివరి తేదీ వేరుశనగ పంటకు జూలై 31, వరి పంటకు ఆగష్టునెల 15వ తేదీలోగా పేరు నమోదు చేసుకోవాలన్నారు. పంట వేసే ప్రతి రైతూ ఈ అవకాశాన్ని ఉపయోగి ంచుకోవాలన్నారు. రైతులతోపాటు వ్యవసాయ శిబ్బంది చిరంజీవి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## పొగాకు బేళ్లు కింద పడి కూలీ మృతి



**కలిగిరి, జూలై22, ప్రభాతవార్త;** కలిగిరి పొగాకు బోర్డులో హమాలీ కూలీగా పని చేస్తున్న మెంతెం శివకోటారెడ్డి(50)బుదవారం పొగాకు బేళ్లక్రింద పడి మృతి చెందాడు. మృతుని బందువులు ,పోలీసులు తెలిపిన వివరాల మేరకు మృతుడు కలిగిరి పొగాకు బోర్డులో కూలీగా గత కొంతకాలంనుండి పనిచేసు న్నారు. ఈక్రమంలో బుదవారం యదావిదిగా పనులు చేసుకొనే క్రమంలో అమ్మకాలు జరిగిన పొగాకు బేళ్లను లారీలకు ఎక్కించి లోడు చేస్తున్నారు. లారీ లోడింగ్ అయిన తరువాత పక్కన నిలపడం జరిగింది. లోడైన లారీకి తాడు లాగుతున్న క్రమంలో పొగాకు బేళ్లు ఒక్కసారిగా మృతునిపై పడ్డాయి. పక్కనే ఉన్న కూలీలు పొగాకు బేళ్లను తప్పించే సమయానికే శివకోటారెడ్డి మృతి చేందాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్తలానికి చేరుకొని జరిగిన సంఘటనపై వివరాలు సేకరించారు. మృతుని బార్య ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగామృతుడుకుటుంబం కదు పేదరికంలో ఉన్నందున ప్రభుత్వమే ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని మృతిని బందువులు వేడుకుంటున్నారు. కాగా మృతుని శవాన్ని పోలీసులు పంచనామాకోసం ఆత్మకూరు తరలించారు.

## ఉపాదీ హామి పనుల పురోగతిపై సమావేశం



**సీతారామపురం జులై 22 ప్రభాతవార్త :** సీతారామపురం మండలంలో జరుగుతున్న విబిజి ,రాంజీ ఉపాధీ పనుల పురోగతిపై సిబ్బంది ప్రత్యేక శ్రద్ద చూపాలని ఎంపిడిఓ చిన్న చెన్నారావు పేర్కున్నారు. బుధవారం స్దానిక ఉపాధీహామి భవనంలో సిబ్బందితో సాదారణ సమావేశాన్ని నిర్వహిం చారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతు పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని నాణ్యతా ప్రమాణాలు పాటిస్తు వేగవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. ఫెండింగ్‌లో ఉన్న పనులపై ప్రత్యేక దృష్టి సారించి గ్రామాల వారిగా పురోగతిని పరిశీలించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందేలా అధికారులు సమన్వాయంతో పని చేయాలని ఆయన ఆదేశించారు. ఏపిఓ శ్యామలా, పిఏ నరసింహ, డిఎప్‌టి హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ వినియోగదారుల సమస్యలకు సీజీఆర్ఎఫ్ ద్వారా వేగవంతమైన పరిష్కారం

**- జస్టిస్ (రిటైర్డ్) వి. శ్రీనివాస ఆంజనేయ మూర్తి**



**నెల్లూరు, జులై 22, ప్రభాతవార్త - వైద్యం :** విద్యుత్ వినియోగదారుల సమస్యలకు సీజీఆర్ఎఫ్ ద్వారా వేగవంతమైన పరిష్కారం చూపడం జరుగుతుందని విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక చైర్మన్ జస్టిస్ (రిటైర్డ్) వి. శ్రీనివాస ఆంజనేయ మూర్తి తెలిపారు. ఆయన బుధవారం విద్యుత్ శాఖ గెస్ట్ హౌస్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావే శంలో మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు సం బందిత అధికారుల వద్ద వారి సమస్యలు పరిష్కారం కాకపోతే సీజీఆర్ఎఫ్‌ను ఆశ్రయించాలని తెలిపారు. తమకు వచ్చిన 1,291 ఫిర్యాదుల్లో 1,234 పరిష్కారం చూపామని, వినియోగదారులకు సీజీఆర్ఎఫ్ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యుత్ వినియోగదారులు నుంచి ప్రత్యక్షంగా, పోస్టు, వాట్సాప్, ఈమెయిల్, ఆన్‌లైన్ ద్వారా కూడా ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదులను నిష్పాక్షికంగా, పారదర్శకంగా, నిర్ణీత గడువులోపు పరిష్కరించేందుకు సీజీఆర్ఎఫ్ సమర్థవంతంగా పనిచేస్తోందని తెలిపారు. విద్యుత్ చట్టం-2003లోని సెక్షన్-42 ప్రకారం, ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి నిబంధనల మేరకు సీజీఆర్ఎఫ్ ఏర్పాటైందని తెలిపారు. స్థానిక అధికారుల స్థాయిలో పరిష్కారం కాని ఫిర్యాదులను విచారించి వినియోగదారులకు న్యాయం చేయడమే సీజీఆర్ఎఫ్ ప్రధాన ఉద్దేశమన్నారు. కొత్త విద్యుత్ సర్వీసులు, విద్యుత్ బిల్లులు, ట్రాన్స్‌ఫార్మర్లు, మీటర్ లోపాలు, మీటర్ మార్పిడి, లోడ్ పెంపు లేదా తగ్గింపు, సబ్‌స్టేషన్ నిర్వహణ, యజమాని పేరు మార్పు, కేటగిరీ మార్పు, బిల్లుల్లో లోపాలు, ఇతర విద్యుత్ సేవలకు సంబంధించిన సమస్యలపై సంబంధిత అధికారుల వద్ద పరిష్కారం లభించని పక్షంలో వినియోగదారులు సీజీఆర్ఎఫ్‌ను ఆశ్రయించవచ్చని వివరించారు. అయితే, సీజీఆర్ఎఫ్‌ను ఆశ్రయించే ముందు వినియోగదారులు తమ ఫిర్యాదులను సెక్షన్ కార్యాలయం, అసిస్టెంట్ ఇంజనీర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లేదా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ స్థాయిలో నమోదు చేయాలని, అక్కడ కూడా పరిష్కారం కాకపోతే మాత్రమే సీజీఆర్ఎఫ్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రత్యక్షంగా, పోస్టు ద్వారా, సెల్‌ఫోన్, వాట్సాప్, ఈమెయిల్ లేదా ఏపీఎస్‌పి డిసిఎల్ వెబ్‌సైట్‌లోని సిజీఆర్ఎఫ్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా ఫిర్యాదులు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. సీజీఆర్ఎఫ్ తీర్పుపై అసంతృప్తి ఉంటే నిర్ణీత గడువులో విద్యుత్ ఒంబుడ్స్‌మన్‌ను ఆశ్రయించే అవకాశం కూడా ఉందని పేర్కొన్నారు. సీజీఆర్ఎఫ్ పనితీరును వివరిస్తూ, 2023 సెప్టెంబర్ 11 నుంచి 2026 జూన్ 30 వరకు మొత్తం 1,291 ఫిర్యాదులు అందగా, వాటిలో 1,234 ఫిర్యాదులను పరిష్కరించామని, 123 ఫిర్యాదులు నిర్దేశిత గడువులో పరిష్కారమయ్యాయని, ప్రస్తుతం కేవలం 58 ఫిర్యాదులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. అలాగే 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 638 ఫిర్యాదులు అందగా, అధిక శాతం ఫిర్యాదులను పరిష్కరించామని, ప్రస్తుతం సీజీఆర్ఎఫ్‌లో ఒకే ఒక కేసు మాత్రమే పెండింగ్‌లో ఉందని వెల్లడించారు. సీజీఆర్ఎఫ్ సంప్రదింపు వివరాలను చిరునామా: ది ఛైర్‌పర్సన్, సీజీఆర్ఎఫ్, ఏపీఎస్పిడిసిఎల్ 19/13/65కెవి, విద్యుత్ నిలయం, శ్రీనివాసపురం, తిరుచానూరు రోడ్, తిరుపతి - 517503, ఫోన్: 08772284118, సెల్: 9440812154, ఈమెయిల్: సెక్రటరీ సిజీ ఆర్ ఎఫ్ఎట్‌దిరేట్‌ఆఫ్‌ఏపీఎస్‌పిడిసిఎల్.ఇన్ విద్యుత్ అంబుడ్స్‌మన్ చిరునామా ది విద్యుత్ అంబుడ్స్‌మన్, ఆంధ్రప్రదేశ్, 3వ అంతస్తు, శ్రీ మంజునాథ టెక్నికల్ సర్వీసెస్, ప్లాట్ నెం.38, కేసినేని అడ్మిన్ ఆఫీస్ సమీపంలో, శ్రీ రామచంద్ర నగర్, మహానాడు రోడ్, విజయవాడ - 520008కు పిర్యాదు చేయవచ్చు అన్నారు. చివరగా, విద్యుత్ వినియోగదారులు తమ హక్కులను పరిరక్షించుకోవడానికి సీజీఆర్ఎఫ్ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సీజీఆర్ఎఫ్ ఛైర్మన్ జస్టిస్ (రిటైర్డ్) వి. శ్రీనివాస ఆంజనేయ మూర్తి విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో సీజీఆర్ఎఫ్ మెంబర్ (ఫైనాన్స్) జి. మధుకుమార్, సీజీఆర్ఎఫ్ మెంబర్ (టెక్నికల్) ఏ. శ్రీనివాస బాబు, ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ కె. రాఘవేంద్రం, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (టౌన్) శ్రీధర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (రూరల్) ప్రసాద్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదిశంకర డీమ్డ్ టు బి యూనివర్సిటీలో కోడ్ స్ప్రింట్ 2026 పోస్టర్ ఆవిష్కరణ



**గూడూరు, జూలై 22, ప్రభాతవార్త :** ఆదిశంకర డీమ్డ్ టు బి యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కోడ్ స్ప్రింట్ 2026 8 గంటల జాతీయ స్థాయి హ్యాకథాన్ పోస్టర్‌ను బుధవారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ డా. ఎం. రాజయ్య మాట్లాడుతూ కోడ్ స్ప్రింట్ 2026 జాతీయ స్థాయి హ్యాకథాన్‌ను అన్ని కళాశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, తమ సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యాలను ప్రదర్శించి ఆకర్షణీయమైన నగదు బహుమతులను గెలుచుకోవాలని పిలుపునిచ్చారు. ఇటువంటి హ్యాకథాన్‌లు విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచన, సమస్య పరిష్కార నైపుణ్యాలు ,జట్టుగా పనిచేసే సామర్థ్యాన్ని పెంపొందించడంలో ఎంతో దోహదపడతాయని ఆయన తెలిపారు. విజేతలకు మొత్తం రూ.2,00,000 నగదు బహుమతులు అందజేయబడనున్నాయి. విద్యార్థులు అధిక సంఖ్యలో నమోదు చేసుకుని ఈ జాతీయ స్థాయి హ్యాకథాన్‌ను విజయవంతం చేయాలని యూని వర్సిటీ యాజమాన్యం పిలుపునిచ్చింది. డిప్యూటీ రిజిస్ట్రార్ రామయ్య, డీన్ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, ప్రిన్సిపాల్, వివిధ విభాగాల డీన్లు, హెచ్‌వోడీలు, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్లు, స్టూడెంట్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

# గూడూరు మెప్మా ద్వారా పీఎం స్వనిధి రుణాల పంపిణీ



**గూడూరు, జూలై 29, ప్రభాతవార్త :** గూడూరు మున్సిపాలిటీలో ప్రాజెక్ట్ డైరెక్టర్, మెప్మా ఎం.కిరణ్ కుమార్ బ్యాంక్‌లను సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని వీధి విక్రయదారులకు పిఎం స్వనిధి పథకంలో మొదటి దఫా 15 వేల రూపాయలు, రెండవ దఫా 25 వేలు మూడవ దఫాగా 50 వేల రూపాయలు అందించబడుతుందని తెలిపారు. రెండవ దఫా పూర్తి చేసిన లబ్ధిదారులకు క్రెడిట్ కార్డు ఇప్పించి 30 వేల వరకు రుణం తీసుకునే అవకాశం కూడా ఉంది అని మన గూడూరు మునిసిపాలిటీలో ఇప్పటి వరకు వంద మందికి ఈ అవకాశం ఇవ్వడం జరిగింది అని తెలిపారు. కెనరా బ్యాంకు గూడూరు బ్రాంచి, యూనియన్ బ్యాంక్ కోనేటిమిట్ట, ఇండియన్ బ్యాంక్ గూడూరు, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ చెన్నూరు 4 బ్రాంచీలలో కలిపి 194 మందికి గాను, 29.1 లక్షల రూపాయలు లబ్ధిదారులకు వారి వారి వ్యక్తిగత ఖాతాలలో 3 రోజుల్లో జమ చేయడం జరుగుతుందన్నారు. పిడి అన్ని బ్రాంచిలను సందర్శించి వీధి విక్రయదారులు, స్వయం సహాయక సభ్యులతో మాట్లాడారు. ప్రతి సంఘ సభ్యులు తాను తీసుకున్న బ్యాంక్ లింకేజీ రుణం జీవనోపాధిని ఏర్పాటు చేసుకుని ఆదాయంను మెరుగుపరుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిటీ మిషన్ మేనేజర్ కాంతయ్య, సిఓలు విష్ణు, చందన, పావని, డిఈఓ ఉష, టీఎల్ఎఫ్ అధ్యక్షురాలు సులోచన, ఆర్పిలు పాల్గొన్నారు.

# ఈనెల 24 న మెగా పేరెంట్స్ డే



**గూడూరు రూరల్, జూలై 22, ప్రభాతవార్త :** గూడూరు రూరల్ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల నందు ఈనెల 24న మెగా పేరెంట్స్ డే నిర్వహిస్తున్నామని గూడూరు ఎంఈవో 1 మాధవ రావు పేర్కొన్నారు. పండుగ వాతావరణంలో మెగా పిటిఎం 3.0 నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి పాఠశాల నందు ఒక పబ్లిక్ రిప్రజెంటేషన్ హాజరవుతారని తెలిపారు. తల్లిదండ్రులుకు గత సంవత్సరం ప్రగతిని తెలియజేస్తారన్నారు. పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల భాగస్వామ్యం కొరకు ఈ కార్యక్రమం బాగా ఉపయోగపడుతుందన్నారు.

# వైభవంగా కోటమ్మ ఉత్సవాలు ప్రారంభం



**కోట, జులై 22 ప్రభాతవార్త :** కోట మండలంలోని వెంకన్నపాళె గ్రామ పంచాయతీలోని వీరారెడ్డి సత్రంలో బుధవారం నుంచి కోటమ్మ ఉత్సవాలు ఘనంగా ప్రారంబమైయ్యాయి. అమ్మవారిని అలకరించారు. బాణ సంచా వేడుకలతో తప్పెట్లుతో మంగళవాయిద్యములు పంబజోళ్ల కొమ్ము సందళ్లతో గంగపెట్టి గ్రామోత్సవంను వైభవంగా నిర్వహించారు. ఈనెల 24 వరకు ఉత్సవాలు జరుగుతాయని వీరారెడ్డిసత్రం ఆర్గనైజింగ్ గౌడ్ బృందం తెలిపింది. 23న పూజ నివేదన తీర్థ ప్రసాద వితరణ పోతురాజు ముగ్గు ఉంటుం దన్నారు. 24న బలి నివేదనలతో బాణా సంచా వేడుకలతో మంగళవాయిద్యములతో కోమ్ము, పంబ జోళ్ల సందళ్లతో తప్పెట్లతో గంగ పెట్టేలతో అంగరంగ వైభవంగా గ్రామోత్సవం జరుగుతుందన్నారు. ఇప్పటికే కోటమ్మ ఉత్సవాలను తలికించేందుకు బందుమిత్రులు, వీరారెడ్డిసత్రం కళకళలాడుతోంది. కోటమ్మ ఆలయం విద్యుత్ కాంతులతో అలరిల్లుతుంది.

# ప్రధాని మోడీ ఇంటిని ముట్టడించి భద్రత నియమాల ఉల్లంఘనకు రాహుల్, ప్రియాంక గాంధీలు పాల్పడ్డారు

**– బిజెపి నేత మిడతల రమేష్**



**నెల్లూరు, జూలై 22, ప్రభాతవార్త అగ్రికల్చర్:** నీట్ పేపర్ లీకేజీ అంశాలపై పార్లమెంటులో చర్చకు సిద్ధమని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అహంకారపూరితంగా ప్రధాని ఇంటి ముందు బైఠాయించారని బిజెపి సీనియర్ నేత మిడతల రమేష్ బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. రాహుల్ ప్రియాంకల వైఖరి రాజకీయగాబాధ్యతారాహిత్యంగా ఉన్నాయన్నారు. ప్రధాని మోడీ నివాసం అత్యంత భద్రతా వలయ ప్రాంతం అయినప్పటికీ ప్రధాని ఇంటి ముందు ఆందోళన చేయ డం ద్వారా దేశంలో రాజకీయ అనిశ్చితి సృష్టించాలనీ, కుట్రకు పాల్పడ్డారని తెలిపారు. నీట్ పేపర్ లీకేజీకి కారణమైన వారిపట్ల కఠిన వైఖరి పార్లమెంట్‌లో చర్చ ద్వారా నిర్ణయించాలని రమేష్ ఆ ప్రకటనలో కోరారు.

# మెగా పిటిఎం నిర్వహణపై హెచ్‌ఎంల సమావేశం



**మర్రిపాడు, జులై22, ప్రభాతవార్త:** మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ నిర్వ హణపై మర్రిపాడు మండల విద్యా శాఖ కార్యాలయంలో బుధవారం మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఈనెల 24న మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న మెగా పిటిఎం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై ప్రధానోపాధ్యాయులతో చర్చించారు. ఈసందర్భంగా మండల విద్యాశాఖ అధికారులు తిరుపతయ్య , ధనలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం ఎంతో కీలకమన్నారు. తల్లిదండ్రులు , ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేసినప్పుడే విద్యార్థుల్లో మెరుగైన విద్యా ఫలితాలతో పాటు సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. మెగా పిటిఎం కార్యక్రమానికి విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, పూర్వ విద్యార్థులు, విద్యాభిమానులు, స్థానిక ప్రముఖులను భాగస్వాములను చేయాలని సూచించారు. ప్రతి పాఠశాలలో కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను ముందుగానే పూర్తిచేసి తల్లిదండ్రులకు సమాచారం అందించి వారు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా అవగాహన కల్పించాలని ప్రధానోపాధ్యాయులను కోరారు. పాఠశాలల అభివృద్ధి , విద్యార్థుల భవిష్యత్తు , ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేయడం వంటి అంశాలపై తల్లిదండ్రుల అభిప్రాయాలను స్వీకరించి వాటిని పాఠశాల అభివృద్ధి ప్రణాళికలో భాగంగా చేసుకోవాలని సూచించారు. మెగా పిటిఎం ద్వారా పాఠశాల మరియు తల్లిదండ్రుల మధ్య మరింత బలమైన అనుబంధం ఏర్పడేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో మెగా పిటిఎం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈసమావేశంలో మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఎస్సీ కాలనీలో తాగునీటి ఎద్దడి

**– పైపులైన్ మరమ్మత్తులు చేయాలని గ్రామస్తులు విజ్ఞప్తి**

**దగదర్తి, జులై 22, ప్రభాతవార్త :** మండలంలోని కొత్తపల్లి కౌరగుంట పంచాయతీ ఎస్సీ కాలనీలో నాలుగు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాటర్ ట్యాంకు నుంచి కుళాయిలకు నీటిని సరఫరా చేసే పైపులైన్లు పలు చోట్ల పగిలిపోవడంతో పెద్ద ఎత్తున నీరు వృధాగా పోతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ నేపథ్యంలో నీటి సరఫరాను అధికారులు నిలిపివేశారు. పైపులైన్లు దెబ్బతిన్న విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లి, వెంటనే మరమ్మత్తులు చేపట్టి తాగునీటి సరఫరాను పునరుద్దరించాలని కోరినా ఇప్పటి వరకు సమస్యను పరిష్కరించలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. వేసవి కాలంలో తాగునీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నందున అధికారులు తక్షణమే స్పందించి పైపులైన్ మరమ్మత్తులు పూర్తి చేసి ఎస్సీ కాలనీకి నిరంతర తాగునీటి సరఫరా అందించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# విబిజి రామ్ జి పనులను పరిశీలన



**వింజమూరు, జూలై 22, ప్రభాతవార్త :** వింజమూరు మండలంలోని నందిగంట గ్రామంలో జరుగుతున్న వి బి జి రాంజీ ఉపాధి హామీ పనులను మండల ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 125 రోజుల పని దినాలను సద్వినియోగం చేసుకొని గరిష్ట వేతనం 312 రూపాయలను పొందాలని సూచించారు. అలాగే కేంద్రం నిర్ణయించిన నాలుగు గంటలు పని వ్యవధితో పాటు ఇచ్చిన కొలతల మేరకు పనిచేసి గరిష్ట వేతనం పొందాలన్నారు. అలాగే పని ప్రదేశాలలో కనీస వసతులు విషయములో చర్యలు తీసుకోవాలని ఉపాధి హామీ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అలాగే నంది గుంటలో విబిజి రాంజీ ద్వారా చేపట్టిన హార్టికల్చర్ మామిడి తోటను పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు. హార్టికల్చర్ అభివృద్ధికి విబిజి రాంజీ ద్వారా ఎక్కువ రాయితీ ఉందని వింజమూరు మండల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఏపీఓ శ్రీనివాసులు, డి ఎఫ్ టి మాలాద్రి, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

# తల్లుల ఖాతాలో తల్లికి వందనం నిధులు జమ

**– మండలంలో 4771 మంది లబ్ధిదారులు**



**వింజమూరు, జూలై 22, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో తల్లికి వందనం ఒకటని వింజమూరు ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ పథకానికి సంబంధించి బుధవారం రాష్ట్ర ప్రభుత్వం తల్లుల ఖాతాల్లో నేరుగా నిధులు జమ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. మండలంలో అర్హులైన 4771 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాయని వెల్లడించారు. అదే విధంగా మండలంలో వివిధ కారణాల వల్ల 777 మంది పిల్లలు అనర్హుల జాబితాలో ఉన్నారని చెప్పారు. అనర్హులుగా ఉన్నవారు ఎందుకు తమ పేరు లేదో తెలుసుకోవాలని సూచించారు. అనర్హుల జాబితాలో ఉన్నవారు తమ గ్రామ సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్‌ను సంప్రదించి, గ్రీవెన్స్‌లో పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు. తమరి మార్కులు క్లియర్ అయిన అనంతరం వారికి కూడా తల్లికి వందనం నిధులు జమ అవుతాయని ఎంపీడీవో స్పష్టం చేశారు. ప్రభుత్వం పేద విద్యార్థుల చదువుల కోసం ఈ పథకాన్ని తీసుకువచ్చిందని, అర్హులైన ప్రతి ఒక్కర వర్తిస్తుందన్నారు.

# మెగా పిటీఎంను విజయవంతం చేయండి

**బిట్రగుంట జూలై 22 ప్రభాతవార్త :** మండలంలోని 53 ప్రభుత్వ పాఠశాలల్లో 24వ తేదీ జరిగే మెగా పిటీఎంను విజయవంతం చేయడానికి ఎంపీడీవో సుబ్రహ్మణ్యం విజ్ఞప్తి చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కలెక్టర్ మంగళవారం మెగా పీటీఎం తల్లికి వందనంపై ప్రత్యేక సూచనలు చేశారని దానికి అనుగుణంగా సచివాలయ ఉద్యోగులు తల్లికి వందనం అర్హత కలిగిన ప్రతి తల్లి ఖాతాలో నిధులు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. జూన్ 30 తరువాత పాఠశాలలు కాలేజ్‌లలో నూతనంగా చేరిన విద్యార్థుల కు ఒక నెల తర్వాత తరువాత నిధులు జమ అవుతాయి. మెగా పిటిఎం కార్యక్రమాన్ని విజయవంతం అయ్యేలా సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరై విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ జయమ్మ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్‌కు రెండు రోజులు మాత్రమే అవకాశం ఉంది



**కోవూరు, జూలై22ప్రభాతవార్త :** ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ఎస్ఐఆర్ కార్యక్రమానికి శుక్రవారం ఆఖరు రోజు అని, ఎవరైనా దూరప్రాంతాలకు వెళ్లిన వారు ప్రస్తుతం ఎలక్షన్ కమిషన్ ఇచ్చిన అవకాశాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య అన్నారు. కోవూరులోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆయన ఎస్ఐఆర్‌కు సంబంధించి ఏఎస్‌వో, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్‌తో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న ఓట్లకు గానూ 3369 ఓట్లు మృతులకు సంబంధించి ఉండడంతో వాటిని తొలగించడం జరిగిందని, 1210 మంది ఓటర్లు రెండు పోలింగ్ స్టేషన్లలో డబుల్ ఎంట్రీలుగా ఉన్నారని, వాటిని కూడా తొలగించడం జరిగిందన్నారు. ఎలక్షన్ కమిషన్ ఇచ్చిన ఈ 10 రోజుల గడువులో 294 మంది దూర ప్రాంతాలకు వెళ్లిన వారు వచ్చి వారికి సంబంధించిన సమాచారాన్ని బీఎల్‌వోలకు అందజేయడం జరిగిందన్నారు. ఇంకా ఎవరైనా ఉంటే ఈ రెండు రోజుల్లో ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ఈ సమీక్షలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ మధుసూదన్‌రావు, ఏఎస్‌వో రామ్మోహన్‌లు ఉన్నారు.

# నేడు ఆర్టీసి ఉద్యోగులకు మెగా వైద్యశిబిరం

**రాపూరు, జూలై22ప్రభాతవార్త :** రాపూరు ఆర్టీసి డిపోలో పనిచేసే ఉద్యోగులకు గురువారం ప్రత్యేక మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ అనీల్ కుమార్ తెలిపారు. ఆర్టీసి జోనల్ ఛైర్మన్ సురేష్ రెడ్డి సౌజన్యంతో నెల్లూరులోని కిమ్స్ అసుపత్రి, ఆయుష్ ఆసుపత్రి, రాపూరు సామాజిక ఆరోగ్య కేంద్రం వారి సంయుక్త ఆధ్వర్యంలో ఈ వైద్యశిబిరం రాపూరు ఆర్టీసి డిపో ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో ఆర్టీసి ఉద్యోగులకు సాధారణ ఆరోగ్య పరిక్షలతో పాటు రక్తపోటు, మధుమేహం, గుండె సంబంధిత ప్రాథమిక పరిక్షలు, ఇతర ఆరోగ్య పరిక్షలు నిర్వహించి నిపుణులైన వైద్యులు అవసరమైన వైద్య సలహాలు అందిస్తారన్నారు. ఉద్యోగుల ఆరోగ్యమే సంస్థ అభివృద్ధికి, ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి బలమైన పునాదిగా నిలుస్తుందని ఆయన తెలిపారు. ప్రతి ఉద్యోగి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోని ఆరోగ్య పరిక్షలు చేయించుకోవాలని ఆయన కోరారు.

# ఛలో పార్లమెంట్ విద్యార్థులపై అక్రమ అరెస్టులు అన్యాయం

**రాపూరు, జూలై22ప్రభాతవార్త :** నీట్ పరిక్ష నిర్వహణలో ప్రశ్నా పత్రాల లీకేజి, ఇతర అవకతవకలను నిరసిస్తూ, బలవన్మారణాలకు పాల్పడిన విద్యార్థుల కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతూ ఛలో పార్లమెంట్ నిర్వహిస్తున్న సిజెపి యువజన విద్యార్థి సంఘల అక్రమ అరెస్టులు అన్యాయమని ఆంధ్రప్రదేశ్ రైతుకూలి సంఘం ఒక ప్రకటనలో పేర్కోంది. ఈ కార్యక్రమానికి దేశంలోని వివిధ ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున యువజనులు కదిలి వీదులలోకి వచ్చారన్నారు. వారిని పార్లమెంట్ వైపు రానీయకుండా పోలీసులు ఏర్పాటు చేసిన దిగ్బంధాలను దాటుకోని ముందుకు సాగుతున్న విద్యార్థి యువజనులపై పోలీసులు లాఠీ చార్జి, టీయర్ గ్యాస్ ప్రయోగించడంతో పాటు కక్షబూనిన విధంగా ప్రదర్శకులపై దాడికి పాల్పడారని వారు ఆరోపించారు. తమ న్యాయమైన డిమాండ్లపై ఆందోళన సాగిస్తున్న రైతాంగాన్ని అన్ని విధాలా అణిచివేతకు గురిచేసిన బిజెపి నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం, విద్యార్థి యువజనులపై ఆదే తరహా దాడులకు తెగబడిందన్నారు. ఆనాడు ప్రదర్శకులపైకి కారును వేగంగా తోలి ముగ్గురు ప్రాణాలను బలిగోన్న నేరస్తుని తండ్రి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి అజయ్ మిశ్రా రాజీనామా చేయాలన్న డిమాండ్‌ను సైతం కేంద్ర ప్రభుత్వం తోచిపుచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిరంకుశ అణిచివేత చర్యలను రైతు కూలీ సంఘం ఆంధ్రప్రదేశ్ శాఖ ఖండిస్తున్నట్లు వారు తెలిపారు. సిజెపి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని అరెస్ట్ చేసిన వారందరిని విడుదల చేయాలని ఆప్రకటనలో రైతు కూలి సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఆర్ సుబ్బరాయుడు, జి. సునీతాలు డిమాండ్ చేశారు.

# పంటల బీమాపై రైతులకు అవగాహన



**చేజర్ల, జూలై 22, ప్రభాతవార్త :** చేజర్ల మండలంలోని చేజర్ల, మడపల్లి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనతో పాటు వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాలపై వ్యవసాయ శాఖ అధికారులు సమగ్ర అవగాహన కల్పించారు. వ్యవసాయ అధికారిణి హిమబిందు మాట్లాడుతూ ఖరీఫ్ 2026 సీజన్‌లో చేజర్ల మండలంలో సుమారు 1,800 ఎకరాల్లో వరి, 20 ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేస్తున్నట్లు తెలిపారు. వరి పంటకు ఎకరాకు రూ.840, వేరుశనగ పంటకు రూ.240 ప్రీమియం చెల్లించి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద బీమా పొందవచ్చని వివరించారు. అలాగే రీస్ట్రక్చర్ వెదర్ బేస్డ్ క్రాప్ ఇన్సూరెన్స్ పథకం కింద పత్తి, నిమ్మ తోటలకు కూడా బీమా సౌకర్యం అందుబాటులో ఉందన్నారు. పత్తి పంటకు ఎకరాకు రూ.2000, నిమ్మ తోటలకు ఎకరాకు రూ.2400 ప్రీమియం చెల్లించి బీమా పొందవచ్చని తెలిపారు. దిగుబడి ఆధారంగా అమలయ్యే పంటల బీమాను టాటా ఏఐజీ సంస్థ నిర్వహిస్తుండగా, వాతావరణ ఆధారిత పంటల బీమాను ఇఫ్కో టోక్యో సంస్థ అమలు చేస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయ రుణం తీసుకున్న రైతుల ప్రీమియం మొత్తం ఆటోమేటిక్‌గా బ్యాంకుల ద్వారా మినహాయించబడుతుందని, రుణం తీసుకోని రైతులు స్వయంగా ప్రీమియం చెల్లించి బీమా నమోదు చేసుకోవాలని సూచించారు. రైతులు పంటల బీమా సద్వినియోగం చేసుకుని ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే నష్టాల నుంచి ఆర్థిక రక్షణ పొందాలని వ్యవసాయ అధికారిణి హిమబిందు పిలుపునిచ్చారు.

# ఎంబెడెడ్ సిస్టమ్‌ను పూర్తిస్థాయిలో అవగాహన చేసుకోవాలి



**కోవూరు, జూలై22ప్రభాతవార్త :** ఐటీ రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతిక అంశాలపై విద్యార్థులు పూర్తిస్థాయిలో అవగాహన చేసుకోవాలని కళాశాల డైరెక్టర్ డాక్టర్ జి. సుబ్బారావు తెలిపారు. కోవూరు మండలం గంగవరం గ్రామంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో ఎంబెడెడ్ సిస్టమ్స్‌పై నిర్వహిస్తున్న వర్క్‌షాప్ విజయవంతంగా పూర్తయింది. ఈ సందర్భంగా ఎలక్ట్రానిక్స్ అండఖ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ పెంచలయ్య మాట్లాడుతూ ప్రస్తుతం వస్తున్న నూతన సాంకేతిక మార్పులపై ఇంజనీరింగ్ విద్యార్థులు పూర్తిస్థాయిలో అవగాహన చేసుకోవాలన్నారు. ఇటువంటి వర్క్‌షాపులను కళాశాల యాజమాన్యం ప్రత్యేకంగా విద్యార్థులకు ఏర్పాటు చేసిందని, ఇటువంటి కార్యక్రమాలను వారు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి ఎన్. సుధాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ శ్రావణ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

**డాక్యుమెంట్స్ పోయినది**

ప్రకాశం జిల్లా, పెళ్లూరు గ్రామ పరిధిలో గల సర్వే నంబర్ 50/5 లో ఇండ్ల ప్లాట్ నెంబర్ 72 లో 240 చదరపు అడుగుల స్థలాన్ని 1983 వ సంవత్సరంలో కొనుగోలు చేయడం జరిగింది. దీనికి సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్స్ 03.02.2026 తేదీన కావలి కొత్త హరిజనవాడ నుండి కోర్టు ప్రక్కన ఉన్న ఎస్.బి.ఐ బ్యాంకు వద్దకు జెరాక్స్ తీయించుకొనుటకు వెళుతుండగా మార్గమధ్యలో పోయినది. ఎవరికైనా దొరికిన యెడల క్రింది సెల్ నెంబర్‌కు తెలియజేయగలరు.

గంట రమణయ్య, సెల్: 9000266846.

# ప్రతి పాఠశాలకు ప్రత్యేకాధికారి నియామకం



**కోవూరు, జూలై22ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని 61 మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలల్లో ఈ నెల 24వ తేది నిర్వహించనున్న మెగా టీచర్స్ అండ్ పేరెంట్స్ సమావేశానికి సంబంధించి ప్రతి పాఠశాలకు ఒక ప్రత్యేక అధికారిని నియమించడం జరిగిందని ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలకు ఒక ప్రత్యేక అధికారిని నియమించడం జరిగిందన్నారు. ఇంకా ఎవరైనా విద్యార్థులు తల్లిదండ్రులు అర్హత కలిగి తమ బిడ్డపేరు తల్లికి వందనం లిస్టులో లేకపోతే అటువంటి వారు వెంటనే వారి సమీపంలో ఉన్న సచివాలయంలో గానీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులను గానీ సంప్రదించాలన్నారు. కోవూరు మండలానికి సంబంధించి కేవలం 6 మంది విద్యార్థుల పేర్లు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ సందర్భంగా ఆయన తెలిపారు. 24వ తేది నిర్వహించే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు సహకరించాలన్నారు.

# ఓటు హక్కుకు.. ఇదే అవకాశం : తహశీల్దార్ ఏ. లక్ష్మీ ప్రసన్న



**విడవలూరు, జూలై 22 ప్రభాతవార్త:** మండలంలోని అర్హులైన వారికి ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా ముసాయిదా ఓటరు జాబితాలో పేర్ల నమోదు, వివరాల సవరణకు ఈ నెల 24వ తేదీ వరకు అవకాశం ఉందని తహశీల్దార్ ఏ. లక్ష్మీ ప్రసన్న తెలిపారు. ఓటు హక్కు కలిగి ఉండి ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు సంబంధిత బీఎల్వోలను సంప్రదించి ఎన్నుమరేషన్ ఫారం పొంది, పూర్తి చేసి తిరిగి బీఎల్వోలకు అందజేయాలని సూచించారు. ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో పరిశీలించుకోవడంతో పాటు పేరు, వయసు, చిరునామా తది తర వివరాలను సరిచూసుకోవాలన్నారు. వివరాల్లో మార్పులు అవసరమైతే ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా సవరణలు చేసుకోవచ్చని తెలిపారు. మండలంలోని అర్హులైన ప్రతి ఒక్కరూ గడువులోగా తమ వివరాలను పరిశీలించుకుని, అవసరమైన సవరణలు చేసుకోవడంతో పాటు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# పంటకు బీమా.. రైతుకు ధీమా!

**:ఎంఏఓ సీహెచ్ఎస్ లక్ష్మి**




**విడవలూరు, జులై 22 ప్రభాతవార్త:** మండలంలోని రామచంద్రాపురం, అలగానిపాడు, రామతీర్థం గ్రామాల్లో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని ఎంఏఓ సీహెచ్ఎస్ లక్ష్మి నిర్వహించారు. రైతులకు పంట నమోదు ఆవశ్యకతను వివరించారు. సాగు చేసిన ప్రతి రైతూ తప్ప నిసరిగా పంట నమోదు చేసుకోవాలని సూచిం చారు. రైతు సేవా కేంద్రాల్లో పిల్లిపెసరలు, జీలుగలు అందుబాటులో ఉన్నాయని, రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పంట బీమా ఆవశ్యకతను వివరిస్తూ వరి పంటకు ఎకరాకు రూ.840 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని, ఆగస్టు 15వ తేదీ చివరి గడువని తెలిపారు. వేరుశనగ పంటకు ఎకరాకు రూ.284 ప్రీమియం కాగా, జూలై 31వ తేదీ వరకు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన రైతులు మీసేవ కేంద్రాలు లేదా కామన్ సర్వీస్ సెంటర్లలో పంట బీమా కోసం నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం రామచంద్రాపురం, రామతీర్థం గ్రామాల్లో ఛాంపియన్ రైతులు ఆవుల రవిచంద్ర, చిన మస్తానయ్య సాగు చేస్తున్న పొలాలను ఎంఏఓ లక్ష్మి పరిశీలించారు. కార్యక్రమంలో వీఏఏలు ప్రత్యూష, శ్రావ్య, రైతులు పాల్గొన్నారు.

# భూసార పరీక్షలపై విద్యార్థులకు అవగాహన



**విడవలూరు, జులై 22 ప్రభాతవార్త:** మండలంలోని వావిళ్ల, అలగానిపాడు గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు భూసార పరీక్షలపై జిల్లా వనరుల కేంద్రం, నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. డీఆర్సీ ఏడీఏ దేవసేన మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులు, పీఎండీఎస్ కిట్ల ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు. కేవీకే శాస్త్రవేత్త అనూష భూసార పరీక్షల కోసం మట్టి నమూనాలను సేకరించే విధానం, సారవంతమైన నేలలను గుర్తించే పద్ధతులపై అవగాహన కల్పించారు. నెల్లూరు ఎస్‌టీఎల్ ఏఓ కళ్యాణి మట్టిలోని వివిధ రకాల పోషకాలు, సూక్ష్మ పోషకాల ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో వీఏఏలు శ్రావ్య, అరుణ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నూతన ఎస్సైకు ఘన సన్మానం



**విడవలూరు, జులై 22 ప్రభాత వార్త:** మండల నూతన సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సాయి కళ్యాణ్ను చౌకచర్ల మాజీ సర్పంచ్ సమాధి శ్రీనివాసులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సై సాయి కళ్యాణ్‌కు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలు తమ సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకువచ్చి సహకరిం చాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు బద్దిపూడి సుదీర్ తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జనార్ధన్‌రెడ్డిని పరామర్శించిన ప్రన్నకుమూర్‌రెడ్డి



**కోట, జులై 22 ప్రభాతవార్త :** కోటలోని ఆర్ఆర్ థియెటర్ అధినేత ,నల్లపరెడ్డి ప్రసన్న కుమా ర్‌రెడ్డి బాల్య మిత్రుడు కొండురూ జనార్ధన రెడ్డి ని మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకు మూం రెడ్డి పరామర్శించారు. ఇటివల జనార్ధన్‌రెడ్డి మాతృమూర్తి కొండూరు సంపూర్ణమ్మ మృతి చెందారు. ఈ నేపద్యంలో బుధవారం నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి జనార్ధన్‌రెడ్డి నివాసంకు వేళ్లి ఆయనను పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతి తెలిపారు. ఆయన వెంట కోట మండల వైకాపా కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ బాస్కర్, సరేంద్రరెడ్డి, వలసకసూర్తయ్య ముని యాదవ్, సర్వప్, మునియాదవ్ తదితరులు ఉన్నారు.

# మీ ఓటు.. మీ హక్కు.. వివరాలు పరిశీలించండి!

**– తహశీల్దార్ కె.స్ఫూర్తి రెడ్డి**



**కొడవలూరు, జూలై 22 ప్రభాతవార్త:** ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా ముసాయిదా ఓటరు జాబితాలో పేర్ల నమోదు, వివరాల సవరణకు 24వ తేదీ వరకు అవకాశం ఉందని తహశీల్దార్ కె.స్ఫూర్తి రెడ్డి తెలిపారు. ఇప్పటివరకు ఎన్నుమరేషన్ ఫారం సమర్పించని అర్హులైన మండలంలోని వారు గడువులోగా ఫారం పూర్తి చేసి సంబంధిత బీఎల్వోలకు అందజేయాలని సూచించారు. ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో పరిశీలించుకోవడంతో పాటు పేరు, వయసు, చిరునామా తదితర వివరాలను సరిచూసుకోవాలన్నారు. ఏవైనా మార్పులు అవసరమైతే ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా సవరణలు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ గడువులోగా ఎన్నుమరేషన్ ఫారాలను పూర్తి చేసి బీఎల్వోలకు సమర్పించాలని, తమ వివరాలను పరిశీలించుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ఈ.సాయి చందు, సీనియర్ అసిస్టెంట్ మస్తాన్‌బాబు, జూనియర్ అసిస్టెంట్లు అశ్విన్, ప్రసన్న పాల్గొన్నారు.

## పంటల బీమా పథకంను సద్వినియోగం చేసుకోండి

### వ్యవసాయాధికారి ఎం.సుచ్చేంద్రప్రసాద్



**కోట,జులై 22 ప్రభాతవార్త** సేంద్రియ వ్యవసాయం పై దృష్టి సారిస్తే పెట్టుబడులు తగ్గుతాయని కోట మండల వ్యవసాయాధికారి ఎం.సుచ్చేంద్ర ప్రసాద్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని చెందోడు, గూడలి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ..ఇష్టానుసారంగా ఎరువులు ,క్రిమిసంహారక మందులు వినియోగించడం ద్వారా పెట్టుబడులు పెరుగుతాయ న్నారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన రైతులు బీమా ప్రిమియం చెల్లించాలని సూచించారు. ఈ నెల 31న రాష్ట్ర ప్రభుత్వం పంటల బీమాకు తుది గడువుగా విధించినట్లు చెప్పారు. తుఫానులు కరువు, అకాల వర్షాలు వంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట దిగుబడి నష్టపోయిన రైతులకు ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందన్నారు. ఎంపిక చేసిన పంటలను సాగు చేస్తూ నిర్ణీత సమయంలో ప్రీమీయం చెల్లించి నమోదు చేసుకున్న కౌలు రైతులతో సహ రైతులందరూ ఈ బీమాలో చేరడానికి అర్హులని పేర్కొన్నారు.సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవచ్చున్నారు. ఎకరాకు రూ 42 వేల రూపాయాలు ఇన్స్‌రేన్సు పొందవచ్చున్నారు. అనంతరం ఎల్‌నినో ప్రభావం నేపద్యంలో ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో విస్తర్ణధికారి సాయి,రైతులు పాల్గొన్నారు.

## బూదూరు గురవయ్యకు అందరూ సహకరించాలి

### - మాజీమంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి



**కోట, జూలై 22 ప్రభాతవార్త** గూడూరు నియోజకవర్గ వైసీపీ సమన్వయ కర్త బూదూరు గురవయ్యకు పార్టీ నా యకులు, కార్యకర్తలు అందరూ సహ కరించాలని మాజీమంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కోరారు. బుధ వారం కోటలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ పార్టీఅధిష్టానం నియ మించిన వారికి అందరూ సహకరించక తప్పదన్నారు. తాను, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి వర్గం కూడా గురవయ్యకు సహకరించాలని కోరారు. జగనన్న ఎవరిని నియమిస్తే వారికి అందరూ సంపూర్ణంగా సహకరిస్తామని చొప్పారు. ఆయన వెంట నల్లపరెడ్డి జగదీష్‌కుమార్‌రెడ్డి, కోట మండల వైసీపీ కన్వీనర్ పలగాటి సంపత్‌కు మార్‌రెడ్డి, గాది భాస్కర్, తదితరులు ఉన్నారు.

## అర్హులందరికీ తల్లికి వందనం: జెడ్పీ డిప్యూటీ సిఇఓ బ్రహ్మయ్య



**కోట, జూలై 22 ప్రభాతవార్త** రాష్ట్రప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాల్లో భాగంగా తల్లికి వందనం పథకాన్ని గత ఏడాది నుంచి అమలు చేస్తోంది. ఈ ఏడాదికి సంబంధించి అర్హుల బ్యాంకు ఖాతాలకు బుధవారం నుంచి డిపిటి ద్వారా నగదు జమఅవుతుందని జెడ్పీ డిప్యూటీ సీఇఓ బ్రహ్మయ్య చెప్పారు. బుధవారం కోట ఎంపిడిఓ కార్యాల యానికి ఆయన విచ్చేశారు. మాట్లాడుతూ కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉన్నా పథకం లబ్ధి అందరికీ వర్తిస్తుందన్నారు. ఒక్కో విద్యార్థికి తల్లికి వందనం కింద రూ.13 వేలు చొప్పున జమ చేస్తారన్నారు. రెండో తరగతి నుంచి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరానికి వచ్చిన విద్యా ర్థుల వివరాలను యుడైస్ పోర్టల్ ద్వారా సేకరించి అర్హులను ఎంపిక చేసినట్లుతెలిపారు. మండలంలోని అన్ని సచి వాలయాల్లో వెల్ఫేర్ అసిస్టెంట్లు ఈ జాబితాను పారదర్శకంగా చేశారని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా అనర్హుల జాబితాపై వచ్చే నెల 3వతేదీ వరకు అభ్యంతరాలను స్వీకరిస్తామని, 4నుంచి 10వ తేదీలోగా అభ్యం తరాల పరిశీలన, అర్హుల జాబితా ప్రచురిస్తామని చెప్పారు. ఆగస్టు 30న 1వతరగతి, ఇంటర్మీడియట్ ప్రదమ సంవత్స రంవిద్యార్థుల జాబితాను ప్రచురిస్తామన్నారు. అదేరోజున తల్లుల బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ అవుతుందన్నారు. ఆయన వెంట ఎంపిడిఓ దిలీప్‌కుమార్‌ఉన్నారు.

## రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల అరెస్ట్ హేయమైన చర్య

### - కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంటా శ్రీనివాసులు రెడ్డి



**గూడూరు, జూలై 22, ప్రభాతవార్త :** రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల అరెస్టులను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పంటా శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ రాహుల్ గాంధీని పోలీసులు అరెస్టు చేయడం, ఆయన పట్ల దురుసుగా వ్యవహరించడం దారుణమని తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రతిపక్ష నాయకులపై ఇలాంటి చర్యలకు పాల్పడటం సరికాదని అన్నారు. అదేవిధంగా, నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ ,దానికి సంబంధించిన పరిణామాల కారణంగా ఆత్మహత్యలకు పాల్పడిన విద్యార్థుల కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.ఒక కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంలో ప్రమేయం ఉన్నట్లు తేలిన ప్రభుత్వ అధికారులు, ఇతర బాధ్యులపై వెంటనే సమగ్ర దర్యాప్తు జరిపి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ తరపున డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్వేపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పూల చంద్ర శేఖర్, గూడూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ రామకృష్ణయ్య, చిలకూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వ్యామయ్య, సైదాపురం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మురారి కృష్ణయ్య, గూడూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుబ్బారావు, మైనారిటీ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఫయాజ్, మైనారిటీ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి రషీద్ తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు కిమ్స్ హాస్పిటల్ ఆసుపత్రి వైద్యులు ఆధ్వర్యంలో ప్రపంచ బ్రెయిన్ దినోత్సవం




**నెల్లూరు, జూలై 22, ప్రభాతవార్త - వైద్యం** ప్రపంచ బ్రెయిన్ దినోత్సవం సందర్భంగా నెల్లూరు కిమ్స్ హాస్పిటల్ ఆసుపత్రి వైద్యులు పోలీస్ సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వరల్డ్ బ్రెయిన్ డే సందర్భంగా 22వ తేదీన కిమ్స్ హాస్పిటల్, నెల్లూరు వారు పోలీస్ సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు మెగా ఉచిత వైద్య శిబిరంను పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లోని ఉమేష్ చంద్ర మెమోరియల్ హాల్‌లో విజయవంతంగా నిర్వహించారు. నెల్లూరు అడిషనల్ ఎస్‌పి సౌజన్య మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది, వారి యొక్క దైనందిన కార్యక్రమాలలో నిత్యం ఎంతో వ్యయ ప్రయాసలతో శ్రమిస్తూ ఎన్నో వృత్తి పరమైన టెన్షన్‌లను, సవాళ్ళను ఎదుర్కొంటున్నారని తెలిపారు. వారికి,వారి కుటుంబ సభ్యులకు కిమ్స్ హాస్పిటల్ వైద్యులు ప్రముఖ సీనియర్ న్యూరో సర్జన్ డాక్టర్. సి. కృష్ణమోహన్, న్యూరో సర్జన్ డాక్టర్. జె. సాయినాథ్, సీనియర్ న్యూరో ఫిజిషియన్ డాక్టర్. జె. సంఘమిత్ర, న్యూరో ఫిజిషియన్ డాక్టర్. వి. అభినయ్ రెడ్డి, న్యూరో ఫిజిషియన్ డాక్టర్. బి.వి. సాయి భరత్, హెచ్ఓడి ఇంటెన్సివిస్ట్ డాక్టర్ వి.జగదీష్ హెచ్ఓడి ఎమర్జెన్సీ డాక్టర్ వి శివరామ్ కృష్ణ రెడ్డిలు పాల్గొని ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. వైద్యులు తమ హాస్పిటల్ లో ఎంతో బిజీగా ఉన్నప్పటికీ వారి సమయాన్ని పోలీస్ వారి కోసం కేటాయించి ఇక్కడ ఈ మెగా ఉచిత వైద్య శిబిరంలో సుమారు 200 మందికి పైగా పోలీస్ సిబ్బందిని పరీక్షించి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయడం సంతోషంగా ఉందని తెలియజేశారు.ఈ సందర్బంగా కిమ్స్ వైద్యులు మాట్లాడుతూ మెదడు సంబంధిత వ్యాధులు, పక్షవాతం (స్ట్రోక్), తలనొప్పి, మూర్ఛ (ఎపిలెప్సీ), పార్కిన్సన్స్ వ్యాధి, జ్ఞాపకశక్తి సమస్యలు, నరాల సంబంధిత ఇతర వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. మెదడు ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సమతుల్యఆహారం, క్రమం తప్పకుండా వ్యాయామం,రక్తపోటు, మధుమేహం,కొలెస్ట్రాల్ నియంత్రణ, ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండటం, తగినంత నిద్ర, ఒత్తిడిని తగ్గించుకోవడం వంటి ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించడం అత్యంత అవసరమని తెలిపారు. అలాగే స్ట్రోక్ లక్షణాలు కనిపించిన వెంటనే సమీపంలోని ఆసుపత్రికి చేరుకుంటే ప్రాణాలను కాపాడటంతో పాటు శాశ్వత వైకల్యాన్ని నివా రించవచ్చని వివరించారు. పని వేళలలో కానీ, ఆక్సిడెంట్‌ల వలన గానీ మరి ఎక్కడైనా అకస్మాతుగా గుండె నొప్పి వచ్చి స్పృహ కోల్పోయిన సందర్బంలో సిపి ఆర్ చేసి ప్రాణాలను కాపాడే విధానాన్ని ప్రాక్టికల్‌గా చేసి పోలీస్ సిబ్బందికి వివరించారు. ఈ సందర్బంగా ప్రజల ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా కిమ్స్ హాస్పిటల్స్ న్యూరో సైన్సెస్ విభాగానికి సంబంధించిన ప్రత్యేక హెల్త్ స్క్రీనింగ్ ప్యాకేజీను పోలీస్ ప్రముఖులు, కిమ్స్ వైద్యులు ఆవిష్కరించి అందుబాటులోకి తీసుకువచ్చారు. సాధారణంగా రూ. 20వేల రూపాయలు విలువైన ఈ ప్యాకేజీని కేవలం 6,999 రూపాయిలకే ప్రత్యేక రాయితీ ధరకు అందిస్తున్నట్లు ప్రకటించారు. అడిషనల్ ఎస్‌పి (ఏఆర్)పి. శ్రీను అప్పారావు, నెల్లూరు రూరల్ డీస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు,ఏఆర్ డీస్పీచంద్రమోహన్,యూనిట్ సిఓ డాక్టర్ రోహిణి ప్రియ లక్ష్మి, మెడికల్ కోఆర్డినేటర్ డాక్టర్. శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

## బుచ్చి సిఐని,ఎస్ఐని సన్మానించిన బిజెపి నేతలు



**బుచ్చి జులై 22 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెంకి కొత్తగా వచ్చిన సిఐ శివరా మకృష్ణారెడ్డిని,ఎస్ఐ ఉమాశంకర్‌ని బిజెపి సీనియర్‌నాయాకులు జి.వి కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు ఇనుగూరు బాలయ్య, గుబ్బా సూరి, ఇనుగూరు సుబ్బారావు, గాదంశెట్టి శ్రీనివాసులు, కారంశెట్టి ప్రసాద్, గాదంశెట్టి సురేష్, ముల్లంగి వెంకటేశ్వర్లు, తదితరులు సిఐ,ఎస్ఐని మర్యాదపూర్వకంగా కలిసి వారిని శాలువాలతో,పూలమాలలతో సన్మానించి సత్కరించారు. బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలో పూర్తి స్దాయిలో లాండ్ ఆర్డర్ కాపాడాలని వారు కోరారు.

## పారిశుద్ధ్య పర్యవేక్షణలో కమిషనర్



**నెల్లూరు కార్పోరేషన్, జులై 22 ప్రభాతవార్త :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ పారిశుద్ధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా బుధవారం ఇంజనీరింగ్, శానిటేషన్ విభాగం అధికారులతో కలిసి స్థానిక ఎన్‌టిఆర్ నెక్లెస్ రోడ్డు ప్రాంతంలో పర్యటించారు. ఏపి టూరిజం పార్క్ నుంచి గణేష్ ఘాట్ వరకు రద్దు వెంబడి కమిషనర్ పర్యటించి అధికారులకు వివిధ సూచనలు జారీ చేశారు. ఎన్‌టిఆర్ నెక్లెస్‌రోడ్డు ప్రాంతంలో అవసరమైన డ్రైను కాలువల పూడిక చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఎన్‌టిఆర్ నెక్లెస్ రోడ్డు ప్రాంతంలో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను బహిరంగంగా వేయకుండా స్థానికులకు అవగాహన కల్పించాలని, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని, పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని కమిషనర్ ఆదేశించారు.

## సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జెసి



**అనుమసముద్రంపేట,జులై22, ప్రభాతవార్త:** ఏఎస్‌పేట మండలంలోని శ్రీకొలను గ్రామ సచివాలయాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్బంగా సచివాలయంలోని రికార్డులు, సిబ్బంది పనితీరును పరిశీలించిన ఆయన ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. ఎస్ఐఆర్‌కు సంబంధించి బిఎల్ఓలను వివరాలు అడిగి తెలుసుకున్న జాయింట్ కలెక్టర్ ఇప్పటివరకు ఎంత శాతం పని పూర్తయిందో ఆరా తీశారు. గడువు మరో రెండు రోజులుమాత్రమే మిగిలిన ఉన్నందున మిగిలిన ప్రక్రియను వేగవంతంగా పూర్తిచేయాలని సూచించారు. ఇంటింటికి వెళ్ళి ప్రతి అర్హుడి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి ఎస్ఐఆర్ నమోదు చేయాలని ఒక్కఓటు కూడా మిస్ కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ ప్రక్రియలో నిర్లక్ష్యం ప్రదర్శించిన సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ హెచ్చరించారు. ఈ తనిఖీలో ఇన్‌చార్జ్ తహసిల్దార్ వెంకటేశ్వర్లు, రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కావలి మున్సిపల్ కమిషనర్‌ని కలిసిన ప్రసాద్‌రెడ్డి



**కావలి, జులై 22 ప్రభాతవార్త :** కావలి ము న్సిపల్ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన అబ్దుల్ రషీద్‌ని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం కాంట్రాక్టర్ నోటి ప్రసాద్‌రెడ్డి మ ర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి దుశ్యాలవాలతో ఘనంగా సత్కరించడం జరిగింది. అనంతరం పలు విషయాలను చర్చించుకోవడం జరిగింది.

## కావలి రైల్వేస్టేషన్ ఆదునీకకరణ, పలు రైళ్ళను నిలుపుదల చేయాలని రైల్వే మంత్రిని కోరిన ఎంపి బిఎంఆర్



**కావలి, జులై 22 ప్రభాతవార్త :** రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు యాదవ్ కేంద్ర రైల్వే శాఖామంత్రి అశ్విని వైష్ణవ్‌ను బుధవారం న్యూఢిల్లీలో కలిసి, ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు జిల్లా ప్రజలకు అత్యంత ప్రాధాన్యమైన రెండు కీలక అంశాలపై వినతిపత్రాలు సమర్పించారు. కావలి రైల్వేస్టేషన్‌ను అమృత్ భారత్‌స్టేషన్ పథకం కింద ఆధునీక రించాలని, అలాగే పలు ముఖ్యమైన ఎక్స్‌ప్రెస్ రైళ్ళకు కావలి రైల్వేస్టేషన్‌లో నిలుపుదల కల్పించాలని కోరారు. ఈ సందర్బంగా ఎంపి బీదమస్తాన్‌రావు యాదవ్ మాట్లాడుతూ కావలి రైల్వేస్టేషన్ దక్షిణ మద్య రైల్వే పరిధిలో ఎన్ఎస్‌జి-4 కేటగిరికి చెందిన ముఖ్యమైన స్టేషన్ అని తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఈ స్టేషన్ ద్వారా రూ.13.41కోట్లకు పైగా ఆదాయం సమకూరగా రూ.10.83లక్షల మంది ప్రయాణీకులు ఇక్కడి నుంచి ప్రయాణించారని తెలిపారు. ఏటా సుమారు 20లక్షల మంది ప్రయాణీకులు ఈ స్టేషన్‌ను వినియోగిస్తున్నారని వివరించారు. ఈ స్థాయి ఆదాయం ప్రయణీకుల రద్దీ ఉన్నప్పటికి కావలి స్టేషన్‌కు అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద అవకాశం లభించకపోవడం విచారకరమని పేర్కొన్నారు. కావలి ప్రాంతం రామాయపట్నం పోర్టు, ఐఎఫ్ఎఫ్‌సిఓ కిసాన్ సెజ్, ఏపీఐఐసీ పారిశ్రామిక పార్కులు, జాతీయ రహదారి-16కు అనుసంధానంగా ఉండడంతో భవిష్యత్తులో ప్రయాణీకుల రద్దీ, సరుకు రవాణా మరింత పెరిగే అవకాశాముందని తెలిపారు. అందువల్ల ప్లాట్‌పారంలు విస్తరణ, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, ఎస్కలేటర్లు, లిఫ్టులు ఆధునిక వేయింట్ హాల్స్ డిజిటల్ ప్రయాణీకుల సమాచార వ్యవస్థ మల్టీ లెవల్ పార్కింగ్ తదితర సౌకర్యాలతో కావలి రైల్వేసేటషన్‌ను అభివృద్ధి చేయాలని కోరారు. ప్రజల చిరకాల డిమాండ్ మేరకు శబరి ఎక్స్‌ప్రెస్ హోరా, బెంగుళూరు,హోరా చెన్నై వంటి రైళ్ళకు కావలి రైల్వేస్టేషన్‌లో ఆగేలా మంజూరు చేయాలని విజ్ఞపిత చేయడం జరిగిందన్నారు. దీంతో విదత్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, అయ్యప్ప భక్తులు, సాదారణ ప్రయాణీకులకు, ఎంతో ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. కేంద్ర రైల్వే మంత్రి అశ్వినివైష్ణవ్ ఈ వినతులను సానుకూలంగా పరిశీలించి కావలి ప్రాంత ప్రజల అకాంఓలు నెరవేర్చేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## మున్సిపల్ కమిషనర్, సిఐలను కలిసిన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు



కావలి, జులై 22 ప్రభాతవార్త : కావలి మున్సిలప్ కమీషనర్‌గా అబ్దుల్ రషీద్, వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్‌గా వై. రంగనాథ్‌గౌడ్‌లు నూతనంగా బాధ్యతలు చేపట్టిన సందర్బంగా స్వచ్ఛంద సంస్థల గౌరవ అధ్యక్షులు ఎస్.కె.బాష



ఆధ్వర్యంలో బుధవారం వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సామాజిక సేవకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి దుశ్యాలవాలతో ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రత్నమ్మ ఫౌండేషన్ ఎంవి.ప్రసాద్‌రావు మీ కోసం సేవాసంస్థ రాయపాటి దిలీప్‌కుమార్, హ్యాపీ సేవా సంస్థ సయ్యద్ ఘనిబాష, టైమ్ టు హెల్ప్ ట్రస్ట్ రమేష్, జాగో సంస్థ జమీర్ గుడ్‌మెన్ బ్రహ్మయ్య, సామాజిక సేవకులు, లోక్‌సత్తా మాలకొండారెడ్డి, విశ్రాంత తహశీల్దార్ మొఘల్ శిరాజ్ బేగ్, విశ్రాంత హెచ్చ్‌శ్రీం అజిత్‌బాబు, ప్రబాకర్, మహబూబ్ బాష, ఘంటసాల రామచంద్రయ్య, నాగరాజు, విజయ్ దేవరకొండ పాల్గొన్నారు.

## మాజీ మంత్రి పరామర్శలు



**కోవూరు, జులై 22 ప్రభా తవార్త :** మాజీ మంత్రి , వైసీపీ పీఏసీ సభ్యు లు నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి బు ధవారం నాయు డుపేటకు చెందిన వైసీపీ సీనియర్ నాయకులు డాక్టర్ వెడిచర్ల ప్రద్యు మ్నకుమార్‌రెడ్డి ఇటీవల మృతిచెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన సాను భూతిని తెలిపారు. ప్రద్యుమ్న కుమా ర్‌రెడ్డి ఇటీవల మృతి చెందడంతో నాయుడుపేటలోని వారి స్వగృహానికి వెళ్లి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, నల్లపరెడ్డి జగదీష్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

## శాకాంబరి అలంకారంలో నాగవరపమ్మ





**కోవూరు, జూలై22ప్రభాతవార్త :** కోవూరులో వెలసి ఉన్న గ్రా మదేవత శ్రీ నాగవరపమ్మ దేవస్థానంలో ఆషాడమాస బుధ వా రం పర్వదినం సం దర్భంగా శాకాంబరి అలంకారంలో అమ్మ వారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రాత:కాల మునే అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనాథం సుబ్బరామయ్య ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్ర దాయబద్ధంగా నిర్వహించారు. అమ్మవారిని చూసేందుకు చుట్టుపక్కల ప్రాం తాల నుంచి భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పల్లకిసేవ, పూలంగి సేవ కార్యక్రమాలను కన్నులపండువగా నిర్వహించారు.

## జర్నలిస్టుల పై జరుగుతున్న దౌర్జన్యాలను అరికట్టేందుకే "జేపీఎఫ్" ఆవిర్భావం



**నెల్లూరు,జూలై 22,ప్రభాత వార్త-విద్య** సమాజంలో జర్న లిస్టులపై జరుగుతున్న వేదిం పులు, దౌర్జన్యాలు, దాడులు త దితర అంశాలను నివారించి వారికి అండగా నిలిచేందుకే జ ర్నలిస్ట్ ప్రొటెక్షన్ ఫోర్స్(జేపి ఎఫ్)ను ఏర్పాటు చేయటం జరిగిందని పలువురు సీనియర్ జర్నలిస్టులు పేర్కొన్నారు. ఇటీవల జిల్లాలో జర్నలిస్టులపై జరుగుతున్న వేదింపులకు నిరసనగాబుధవారం నగరంలోని స్థానిక కేవిఆర్ సెంటర్‌లో అతిధిగ్రాండ్ హోటల్ లో నెల్లూరు జిల్లాలోని ప్రింట్ , ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలకు చెందిన జిల్లా ఇన్‌చార్జ్‌లు, ఆర్సీ ఇన్‌చార్జ్‌లు, స్టాఫ్ రిపోర్టర్స్ అందరూ కలిసి కట్టుగా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు జిల్లాలోని జర్నలిస్టు యూనియన్స్, సంఘాలకు అతీతంగా జిల్లాల్లో ఎక్కడైనా జర్నలి జానికి సంబందించి జర్నలిస్టులను వేదిస్తున్న సమస్యలను పరిష్కరిచేందుకు అందరూ సంఘటితంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. సమస్యల సాధనకోసం అవసరమైతే పోరాటాలు చేసేందుకైనా సిద్దంగా ఉన్నామన్నారు. ఇటీవల మనుబోలు పోలీసుస్టేషన్ వ్యవహారంలో అనేక ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు పోలీసులు నోటీసులు ఇవ్వటం ప్రతికా స్వేచ్ఛని కాలరాయడమేనని,దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇలాంటి ఘనటలను ఎదుర్కొని జర్నలిస్టుల పక్షాన నిలిచేందుకు తాము అందరం ఏకతాటిపైకి వచ్చి జర్నలిస్టు ప్రొటెక్షన్‌ఫోర్స్‌ను ఏర్పాటుచేయటం జరిగిందన్నారు.ఈఫోర్స్ ఆధ్వర్యంలో జిల్లాలో జర్నలిస్టులపై జరుగుతున్న అరాచకాలను అరికట్టేందుకు కృషిచేస్తామన్నారు. అనంతరం జేపిఎఫ్ కమిటీని సీనియర్ జర్నలిస్టులు ఎంపికచేశారు. కాగా జేపిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులుగా డెక్కన్ క్రానికల్ కరస్పాండెంట్ పి.రాజశేఖర్, కన్వీనర్‌గా చానల్ 9హెచ్‌డి ఇన్‌చార్జ్ జి.జయరాజ్‌లు ఎంపికైయ్యారు. కోకన్వీనర్లుగా విశాలాంధ్రదిన పత్రిక బ్యూరోఇన్‌చార్జ్‌దయాశంకర్,హెచ్‌ఎంటీవి బ్యూరోనరసింహులు,వార్తదినపత్రిక ఆర్సీ ఇన్‌చార్జ్ సిహెచ్.నరేంద్ర బాబు, 99టీవి బ్యూరో మురళీకృష్ణపిళ్లై, ఎన్3 చానల్ ఎండి సునీల్‌లను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభ్యులుగా జిల్లాలోని అన్నీ ప్రముఖప్రింట్,ఎలక్ట్రానిక్ మీడియా ప్రతి నిధులు ఎంపికై య్యారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రభ బ్యూరో ఇన్‌చార్జ్ వి.వెంకటేశ్వర్లు, సాక్షిదిన పత్రిక బ్యూరో మస్తాన్‌రెడ్డి, ప్రజాశక్తి దిన పత్రిక బ్యూరోబాలకృష్ణ, టివి9ఇన్‌చార్జ్ మురళీ, ఈ టీవీరాజారావు, ఆర్‌టివి గయాజ్, మహాన్యూస్ ఇన్‌చార్జ్ దినకర్, వి6ఖాజా,వెంకట్ నారాయణ ఎన్‌టివి, సాక్షి టివి లోకేష్, ఇంటియన్ఎక్స్‌ప్రెస్ సురేంద్ర, ఐ.న్యూస్ సాగర్, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సోమిరెడ్డి నివాసంలో తిరుపతి పార్లమెంటు టీడీపీ సమావేశం



**నెల్లూరు,జూలై 22,ప్రభాతవార్త- వైద్యం** తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షు రాలు పనబాక లక్ష్మి అధ్యక్షతన అల్లీపురంలో జరిగిన సమావేశానికి ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి,కురుగొండ్ల రామకృష్ణ, పాశం సునీల్‌కుమార్, సత్యవేడు ఇన్‌చార్జి శంకర్‌రెడ్డి, తిరుపతి ఇన్‌చార్జి జేబీ శ్రీనివాస్,తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి, శాప్ చైర్మన్ రవినాయుడు హాజరైయ్యారు. పార్లమెంటు నియోకజవర్గ పరిధిలో రాజకీయ పరిస్థితులు, స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో విజయం, అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, త్వరలో చేపట్టనున్న ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేయడం తది తర అంశాలపై చర్చించారు. ఈ సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, నాయకులందరికీ ఆత్మీయ ఎమ్మె ల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, జ్యోతమ్మ సత్కారం చేసారు.

## 45 ఏళ్ల తర్వాత కోలన్ క్యాన్సర్ స్క్రీనింగ్ తప్పనిసరి

### - ముందస్తు గుర్తింపే ప్రాణరక్షణ



### - కన్సల్టెంట్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డా. దీప్తి అల్లా

**నెల్లూరు, జూలై 22, ప్రభాతవార్త - వైద్యం** భారతదేశంలో పెద్దపేగు క్యాన్సర్ (కోలన్ క్యాన్సర్) కేసులు క్రమంగా పెరుగుతున్నాయని, ముఖ్యంగా 45 ఏళ్ల దాటిన ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం ద్వారా ఈ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి పూర్తిగా నయం చేసుకునే అవకాశం ఉందని మెడికవర్ హాస్పిటల్స్ నెల్లూరు కన్సల్టెంట్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డా. దీప్తి అల్లా తెలిపారు. గతంలో వృద్ధుల్లో ఎక్కువగా కనిపించే ఈ క్యాన్సర్ ప్రస్తుతం యువతలో కూడా పెరుగుతోందని ఆమె పేర్కొన్నారు. జీవనశైలి మార్పులు, పీచుపదార్థాలు తక్కువగా ఉండేఆహారం, అధి. కంగా రెడ్ మీట్, ప్రాసెస్డ్ ఫుడ్స్ తీసుకోవడం, ఊబకాయం, వ్యాయామం లేకపోవడం, ధూమపానం, మద్యం సేవించడం వంటి కారణాలు కోలన్ క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతున్నాయని చెప్పారు. కోలన్ క్యాన్సర్ ప్రారంభ దశలో స్పష్టమైన లక్షణాలు కనిపించకపోవడం వల్ల చాలామంది నిర్లక్ష్యం చేస్తారని, అయితే మలంలో రక్తం కనిపించడం, మలవిసర్జన అలవాట్లలో మార్పులు, తరచూ మలబద్ధకం లేదా విరేచనాలు, కడుపు ఉబ్బరం, కారణం లేకుండా బరువు తగ్గడం, రక్తహీనత వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు."పెద్దపేగు క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తిస్తే శస్త్రచికిత్సతో పాటు ఆధునిక చికిత్సల ద్వారా పూర్తిగా నయం చేసే అవకాశాలు చాలా ఎక్కువ. లక్షణాలు కనిపించే వరకు వేచి ఉండకుండా 45 ఏళ్ల దాటిన ప్రతి ఒక్కరూ వైద్యుల సూచన మేరకు కోలనోస్కోపీ వంటి స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలి. కుటుంబంలో ఈ వ్యాధి చరిత్ర ఉన్నవారు మరింత ముందుగానే పరీక్షలు ప్రారంభించడం మంచిది అని డా. దీప్తి అల్లా తెలిపారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, పీచుపదార్థాలు అధికంగా ఉండే ఆహారం, రోజువారీ వ్యాయామం, బరువు నియంత్రణ, ధూమపానం, మద్యానికి దూరంగా ఉండటం ద్వారా కోలన్ క్యాన్సర్ ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చని ఆమె పేర్కొన్నారు. ప్రజలు ఆరోగ్యంపై అవగాహన పెంచుకుని, క్రమం తప్పకుండా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం ద్వారా కోలన్ క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించి ప్రాణాలను కాపాడుకోవచ్చని డా. దీప్తి అల్లా సూచించారు.

## పారదర్శకంగా విధులు నిర్వహించాలి



**కోవూరు, జూలై22ప్రభాతవార్త :** సచివాలయ ఉద్యోగులు ప్రభుత్వం నిర్దేశించిన వేళలు పాటిస్తూతమకు కేటాయించిన విధులు,బాధ్యతలను పారదర్శకంగా నిర్వహించాలని డిప్యూటీ ఎంపీడీవో సురేష్ అన్నారు. కోవూరు మండలం ఇనమడుగు సచివాలయాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ తల్లికి వందనం సంబంధించి అర్హత కలిగి ఎవరైనా నమోదు కాకుంటే అటువంటి వారి వివరాలను పూర్తిస్థాయిలో సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా సంబంధిత సచివాలయ ఉద్యోగి తగు చొరవ తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఎస్ఐఆర్‌కు సంబంధించి ఇంకా ఏమైనా పెండింగ్ ఉంటే వాటిని కూడా ఈ రెండు రోజుల్లో పూర్తి చేసేలా సచివాలయ ఉద్యోగులు తగు చొరవ తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయ ఉద్యోగులకు పలు సూచనలు చేశారు.